www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 223 శుక్రవారం, మే 08, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

- ప్రజాతీర్పును గౌరవించకపోవడం అవమానం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు



**హైదరాబాద్,మే 7 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు. 108 స్థానాలు గెలిచి సింగిల్ లా÷-జంగ్÷స్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించక పోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు. గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ లా÷-జంగ్÷స్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మిగతా2లో...




## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు
- అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా అభివృద్ధి
- 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,మే 7 :** అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. మిగతా2లో...

### దూసుకొస్తున్న ద్రోణి.. రెండు తెలుగు రాష్ట్రాలకు
## వర్షసూచన..!



**అమరావతి,మే 7 :** భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పులవల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉందని తెలిపింది. ఇక తెలంగాణ విషయానికి వస్తే.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాలవర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన ఈత సరదా

- హల్దీ వాగులో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం



**సిద్దిపేట,మే 7 :** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒక శుభకార్యానికి హాజరై, ఆ సంతోషాన్ని పంచుకోవాల్సిన యువకులు విగతజీవులుగా మారడంతో మిగతా2లో...

### డ్రగ్స్ కట్టడి చేయడమే
## తొలి ప్రాధాన్యం

- రిపీటెడ్‌గా పట్టుబడితె పిడి యాక్ట్ పెట్టే ఆలోచన
- ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు
- సమీక్షలో డిజిపి సివి ఆనంద్



**హైదరాబాద్,మే 7 :** రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. మిగతా2లో...

### మహిళా సంగాలకు
## సీతక్క శుభవార్త

- వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు
- ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్,మే 7 :** మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల మిగతా2లో...

### నిజాయితీ, సేవాభావంతో
## పనిచేయండి

- భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలి
- ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి పిలుపు




**హైదరాబాద్,మే 7 :** ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని మిగతా2లో...

### తమిళనాడులో పొలిటికల్ థ్రిల్లర్..
## ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్

- లిఖితపూర్వకంగా బలం చూపించాకే ప్రమాణ స్వీకారం
- 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తిరిగి రండి
- అప్పటి వరకు వేరే ఎవరికీ అవకాశం ఇవ్వను
- విజయ్‌ను మళ్లీ తిప్పి పంపిన తమిళనాడు గవర్నర్ ఆర్లేకర్
- విజయ్‌కు అవకాశం ఇవ్వాలన్న డీఎంకే, వీసీకే, వామపక్షాలు
- అన్నాడీఎంకేతో టీవీకే చర్చలు
- ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు అంగీకారం



**చెన్నై, మే 7 :** తమిళనాడు రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ఆవిర్భవించినప్పటికీ అధికారం మాత్రం ఇంకా అందని ద్రాక్షలాగే మిగిలిపోయింది. రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ గురువారం వరుసగా రెండో రోజు కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న టీవీకే అధినేత విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్ గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మళ్లీ కలిశారు. అయితే 118 మంది ఎమ్మెల్యేల మద్దతు పొందిన తర్వాతే తిరిగి రావాలని గవర్నర్ ఆయనను కోరారని లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. టీవీకేకు ఇంకా అవసరమైన సంఖ్యాబలం తక్కువగా ఉందని, ప్రమాణ స్వీకార ప్రక్రియ జరగడానికి ముందు 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తిరిగి రావాలని గవర్నర్ విజయ్‌కు చెప్పినట్లు మిగతా2లో...

### పదేళ్ల బిఆర్ఎస్ కన్నా
## రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

- 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పన రుణమాఫీ
- బిఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు
- రైతులు ఆర్థానికి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి
- వరంగల్ రైతుమేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల




**హనుమకొండ,మే 7:** బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు మిగతా2లో...




## మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇక నుంచి యూనివ ర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు.

జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

## మహిళా సంగాలకు సీతక్క శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు.

## తమిళనాడులో పొలిటికల్ థ్రిల్లర్.. ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఆ వర్గాలు తెలిపాయి.దయచేసి 118 సంతకాలతో రండి. టీవీకేకు మెజారిటీ ఉందని నిరూపించండి. అప్పుడు ప్రమాణ స్వీకారం జరుగుతుంది అని గవర్నర్ విజయ్‌తో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థిరంగా ఉండి, కూలిపోకుండా ఉండేందుకే గవర్నర్ లిఖితపూర్వక మద్దతుపై పట్టుబట్టారని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏ ఇతర పార్టీని ఆహ్వానించబోమని గవర్నర్ విజయ్‌కు హామీ ఇచ్చారని కూడా తెలిపాయి. తమ సంఖ్యా బలానికి మద్దతుగా సంతకాలతో తిరిగి రావాలని టీవీకేను గవర్నర్ కోరారు. ఆ తర్వాత విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఏఐఏడీఎంకే నాయకుడు ఎడప్పాడి కే పళనిస్వామి గవర్నర్‌తో ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి.ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 9న ముగియనున్నందున కొత్త ప్రభుత్వంపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్ అర్లేకర్‌కు మరి కొన్ని రోజుల వ్యవధి ఉంది. ముందు రోజు కూడా విజయ్ 112 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్‌ను కలిశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ నుంచి విజయ్ మద్దతు పొందినప్పటికీ విజయ్ తనకు పార్టీ అండ ఉందని గవర్నర్‌కు మౌఖికంగా తెలియచేసి సంఖ్యాబలాన్ని మరింత పెంచుకోవడానికి మరికొంత సమయం కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సంఖ్య సరిపోదని విజయ్‌కు తెలియచేసిన గవర్నర్ 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో తిరిగి రావాలని కోరినట్లు తెలిసింది. దీంతో మళ్లీ కొత్త యత్నాలకు ఇది నాంది పలుకుతున్నది.

**విజయ్‌కు అవకాశం ఇవ్వండి** విడుతలై చిరుతైగళ్ కచ్చి(వీసీకే) అధినేత తొల్ తిరుమవళవన్ గురువారం గవర్నర్ అర్లేకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్‌ను ఆహ్వానించి సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. తమిళనాడు రాజకీయాల్లోకి బీజేపీ చొరబడి గందరగోళాన్ని సృష్టిస్తున్నదని స్థానిక మీడియాతో మాట్లాడుతూ తిరుమవళవన్ ఆరోపించారు. ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడిగా ఉన్న విజయ్‌ను పదవీ బాధ్యతలు చేపట్టేందుకు, ఆ తర్వాత అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకునేందుకు అనుమతించాలని ఆయన కోరారు. ఇప్పుడు బీజేపీ లేదా అమిత్ షా, మోదీ తమిళనాడు రాజకీయాల్లో జోక్యం చేసుకుని గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. టీవీకేని ఏకైక అతిపెద్ద పార్టీగా ప్రజలు ఎంచుకున్నారు.అందువల్ల ఆయనను పదవీ బాధ్యతలు చేపట్టడానికి అనుమతించాలి. రాజ్యాంగం కూడా అదే నిర్దేశిస్తున్నది అని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించిన ఎంఎన్ఎం నేత కమల్ హాసన్ ఇది తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును అగౌరవపర్చడం, అవమానపర్చడమేనని అన్నారు. డీఎంకే నేత ఏ శరవణన్ కూడా విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఎన్నికల ముందు ఎలాంటి పొత్తులు పెట్టుకోకుండా అతి పెద్ద పార్టీగా నిలిచిన టీవీకేను ఆహ్వానించడం సముచితమని అన్నారు.

## పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

(మొదటి పేజీ తరువాయి)

రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌవకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని ప్రస్తావించారు. యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా రూ.లక్షకోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని తెలిపారు. కేసీఆర్ హయాంలోని అవినీతి, అహంకా రాన్ని రైతులు ఎప్పటికీ మరచిపోరని చెప్పుకొచ్చారు. కాకతీయుల గడ్డపై కేటీఆర్, తదితరులు చేసిన ప్రసంగాన్ని ప్రజలంతా అసహ్యించు కుంటున్నారని విమర్శించారు. మొక్క జొన్నలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్నలు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేదికపైనే కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. దేశంలో రైతులకు యూరియా అందించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు సంబంధించిన అంశంలో వెనకడుగు వేయబోమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కొంతమంది తనను అవమాన పరచాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలు పంట మార్పిడి చేయాలని, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశర చేశారు. రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ సర్కార్ రూ.21 వేల కోట్లను జమ చేసింది. రూ.లక్ష రుణమా ఫీని కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పూర్తి చేయలేదు. రుణ మాఫీకి బీఆర్ఎస్ ఐదేళ్ల సమయం తీసుకోవడంతో.. వాళ్లిచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదు. ఒక్క రైతుబం ధు ఇచ్చి.. మిగతా పథకాలన్నింటినీ నిలిపివేశారు. బీఆర్ఎస్ అహంకార వైఖరిని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. ఇవాళ రైతులకు అప్పులు తక్కువున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని తుమ్మల తెలిపారు.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

### బిజెపి కార్యకర్తల గుండాల్లో దాడులు చేయడమేంటి..?

### మండిపడ్డ కెటిఆర్ ,హరీష్ రావులు

**హైదరాబాద్,మే 7 :** కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం




అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ–టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యా న్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అను చరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నిం చారు.కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్య కర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

'ఫారెస్ట్ ఆఫ్ ది పూర్' కు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్–1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని అన్నారు.దర్శవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

**అమరావతి,మే 7 :**శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ వేదికగా టీడీపీ మహానాడు– 2026 ను నిర్వహించనున్నారు. ఈ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను పార్టీ హైకమాండ్ నియమించింది. మొత్తం 21 కమిటీలను నియమించింది. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నియమించింది. ఈ మహానాడు మే 27న ప్రారంభమై.. 29వ తేదీతో ముగియనుంది.ఈ మహానాడు నిర్వహణ కోసం మే 6వ తేదీన ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ ఈ మహానాడుకు వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ముగింపు సభకు దాదాపు ఏడు లక్షలకు పైగా కార్యకర్తలు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

## రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు.కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన ఈత సరదా

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ (27), వికాస్ (27), ఆనంద్ రెడ్డి (27) అనే ముగ్గురు స్నేహితులు బుధవారం నాడు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన ఒక పెళ్లి వేడుకకు హాజరయ్యారు. వివాహ వేడుక అనంతరం, గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం సమీపంలోని హల్దీ వాగు వద్దకు చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో.. సరదాగా వాగులో ఈత కొట్టాలని నిర్ణయించు కున్నారు. వాగులోకి దిగిన ఈ ముగ్గురు స్నేహితులకు నీటి లోతుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం పోలీసులు మరియు గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులంతా ఒకే వయసు వారు (27 ఏళ్లు) కావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే ఊరికి చెందిన ముగ్గురు యువకులు, అందులోనూ ప్రాణ స్నేహితులు ఇలా ఒకేసారి మృతి చెందడంతో నర్సాపూర్‌లో విషాదం నెలకొంది. పెళ్లికి వెళ్లి వస్తామని చెప్పిన కొడుకులు శవాలై రావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలాశయాలు, వాగుల వద్దకు వెళ్లేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని, నీటి లోతు తెలియకుండా లోపలికి వెళ్లడం ప్రాణాంతకమని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.

# మే 8వ తేదీన జరిగే జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి.**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 07 (పీపుల్స్ న్యూస్):** మే 8వ తేదీన శుక్రవారం రోజున హనుమకొండ కాళోజి కళాక్షేత్రంలో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా మెగా జాబ్ మేళాను ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఉత్తీర్ణత సాధించిన ములుగు జిల్లా యువతీ యువకులు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ సెక్టార్, కస్టమర్ కేర్ సర్వీస్, హాస్పిటాలిటీ, తదితర రంగాలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కలవని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యా అర్హత ఇతర ధ్రువీకరణ పత్రాలతో నేరుగా మెగా జాబ్ మేళాకు హాజర అవ్వాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# క్రైస్తవ దళితులకు ఎస్సీ హోదా కొనసాగించాలి

**-- "మతం మారినా సామాజిక వివక్ష మారదు... రాజ్యాంగ హక్కులు దూరం చేయొద్దు"**

**-- జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు**



**బాలానగర్ మే 08 ( పీపుల్స్ న్యూస్):** దేశంలో దళితుల హక్కులపై మళ్లీ కీలక చర్చ మొదలైంది. క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు కూడా ఎస్సీ హోదా కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బూదాల బాబురావు కేంద్రం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌ను కోరారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రైస్తవ దళితుల హక్కుల అంశం చర్చనీయాంశంగా మారుతున్నందున ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. మత మార్పిడి జరిగినప్పటికీ దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం తొలగి పోలేదని రాజసుందర్బాబు పేర్కొన్నారు. అందువల్ల మతాన్ని ఆధారంగా చేసుకుని ఎస్సీ హోదాను నిరాకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఆర్టికల్ 341లో మత ప్రస్తావనే లేదని" ఆయన అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో ఎస్సీల నిర్వచనంలో మతానికి సంబంధించి ఎలాంటి స్పష్టమైన పరిమితి లేదన్నారు. అయితే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఎనిమిది నెలల తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా హిందూ మతంలో ఉన్నవారికే ఎస్సీ హోదా వర్తిస్తుందని పేర్కొనడం జరిగిందని గుర్తుచేశారు. తర్వాత 1956లో సిక్కు మతంలోని దళితులకు, 1990లో బౌద్ధ మతంలోని దళితులకు కూడా ఎస్సీ హోదా వర్తించేలా సవరణలు చేసినట్లు తెలిపారు. అయితే అదే హక్కును క్రైస్తవ, ముస్లిం మతాల్లోకి మారిన దళితులకు ఇవ్వకపోవడం వివక్షతేనని విమర్శించారు. "మతం మారితే వివక్ష పోతుందా?" "కేవలం మతం మారిందనే కారణంతో శతాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక వివక్ష ఒక్కసారిగా పోదు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ క్రైస్తవ దళితులు ఇంకా వివక్షనే ఎదుర్కొంటున్నారు. అలాంటప్పుడు వారికి రాజ్యాంగ పరిరక్షణలు దూరం చేయడం అన్యాయమని బాబూరావు పేర్కొన్నారు. క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా లేకపోవడం వల్ల విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలలో తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అట్రాసిటీ చట్టంపై ప్రభావం? ఎస్సీ హోదా సమస్య కొనసాగితే దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద నమోదైన అనేక కేసుల్లో బాధితులకు న్యాయం దూరమయ్యే ప్రమాదం ఉందని గ్రహించాలన్నారు. మతం ఆధారంగా రక్షణలను నిరాకరించడం వల్ల సామాజిక న్యాయం బలహీనపడుతుందని అన్నారు. కేంద్ర కమిషన్‌పై ఆశలు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విచారణ కమిషన్ నివేదిక దేశవ్యాప్తంగా లక్షలాది క్రైస్తవ దళితుల భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశముందని సామాజిక వర్గాలు భావిస్తున్నాయి. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలోని కమిషన్ సమగ్ర అధ్యయనం చేసి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని దళిత సంఘాలు కోరుతున్నాయి. దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన అంశం క్రైస్తవ దళితులకు ఎస్సీ హోదా కల్పించాలా లేదా అన్న అంశం దేశ రాజకీయ, సామాజిక వర్గాల్లో దీర్ఘకాలంగా చర్చకు వస్తూనే ఉంది. ఒకవైపు సామాజిక వివక్ష కొనసాగుతోందని హోదా ఇవ్వాలని వాదిస్తుండగా, మరోవైపు చట్టపరమైన, రాజ్యాంగపరమైన చర్చలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ అంశంపై కేంద్ర కమిషన్ చేపడుతున్న పరిశీలనకు అత్యంత ప్రాధాన్యతను గమనించాలన్నారు.

# సమీకృత కలెక్టరేట్ భవన చివరి దశ సుందరీకరణ పనులను పరిశీలించిన

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**







**ములుగు జిల్లా ప్రతినిధి మే 07 (పీపుల్స్ న్యూస్)** ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన చివరిదశ సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. గురువారం ములుగు గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత కలెక్టరేట్ భవన చివరి దశ సుందరీకరణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ జెండా, సమావేశపు గది, స్టేట్ బోర్డ్, ఛాంబర్, లిఫ్ట్, టాయిలెట్స్, గార్డెనింగ్ సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఈ ఈ శ్యామ్ సింగ్, ఏ ఈ, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

# పస్రా గ్రామంలో మానవ అక్రమ రవాణా నివారణ సదస్సు

**సిస్టర్ మరియా మన్మథ, నిమ్మగడ్డ మహేశ్వరి ఆధ్వర్యంలో అవగాహన.**

**బాలబాలికలు, మహిళలే లక్ష్యంగా అక్రమ రవాణా..**

**అప్రమత్తంగా ఉండాలని పిలుపు.**



**ములుగు జిల్లా ప్రతినిధి (పీపుల్స్ న్యూస్):-** గోవిందరావుపేట మండలం, పస్రా గ్రామం, అభ్యుదయ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గురువారం సెయింట్ మేరీస్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ మరియా మన్మథ, వర్డ్ సంస్థ డైరెక్టర్ శ్రీమతి నిమ్మగడ్డ మహేశ్వరి, సిస్టర్ మేరీ జార్జి ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణాకు ఎవరు ఎక్కువగా గురవుతున్నారనే అంశంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలబాలికలు, వయసులో ఉన్న స్త్రీలు, పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలు అక్రమ రవాణా ముఠాల వలలో సులభంగా చిక్కుకుంటున్నారని వివరించారు. చిన్నారి బిడ్డలు ఏ విధంగా కిడ్నాప్ అవుతున్నారో, ఉద్యోగం, పెళ్లి, చదువు పేరుతో మాయ మాటలు చెప్పి ఎలా మోసం చేస్తున్నారో వివరించారు. ఈ దురాగతాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల పూర్తి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలో స్త్రీ పురుషులు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమ చుట్టుపక్కల జరిగే అనుమానాస్పద కదలికలను గమనించాలని కోరారు. కొత్త వ్యక్తులను నమ్మి పిల్లలను ఎక్కడికీ పంపవద్దని, అపరిచితులతో మాట్లాడవద్దని పిల్లలకు చెప్పాలని తెలిపారు. అనుమానాస్పద ఘటనలు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సిస్టర్ మరియా మన్మథ సూచించారు. మానవ అక్రమ రవాణా అనేది ఆధునిక సమాజానికి పట్టిన చీడపురుగు అని, ఇది ఒక రకమైన ఆధునిక బానిసత్వమని ఆమె పేర్కొన్నారు. దీనిని సమాజం నుండి పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో గ్రామ మహిళలు, యువతులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పొందారు.

# నేడు జగన్నపేటలో ప్రజా దర్బార్

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 07( పీపుల్స్ న్యూస్):** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మే 8వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 4.00 గంటలకు ములుగు మండలం జగన్నపేట ఎం పి యూ పి ఎస్ పాఠశాలలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో జగన్నపేట గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, గ్రామ పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# గౌతమ్‌నగర్‌లో రూ.10 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు

**-- శాశ్వత పరిష్కారం దిశగా మౌలిక వసతుల మెరుగుదలకు అడుగులు**

**-- డివిజన్ పరిధిలో వర్షాకాల సమస్యలకు ముందస్తు పరిష్కారం..**


**-- మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**



**బాలానగర్ మే 08 ( పీపుల్స్ న్యూస్):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని రూ.10 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీలో గత కొన్నేళ్ళుగా ప్రజలను వేధిస్తున్న భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.10 లక్షల నిధులతో ప్రారంభమైన భూగర్భ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. గౌతమ్‌నగర్ కాలనీలో చాలా కాలంగా డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడం, వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడటం, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఈ సమస్యపై పలుమార్లు కాలనీవాసులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు కాలనీలోని ప్రధాన వీధులు మరియు ప్రభావిత ప్రాంతాలను అనుసంధానించేలా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో పనుల పరిశీలన సందర్భంగా మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ "గౌతమ్‌నగర్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సమస్యను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. పనులు పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి సమస్యలు పూర్తిగా తగ్గుతాయిని తెలిపారు. అదేవిధంగా కాలనీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ పనుల వల్ల కాలనీలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగు పడటమే కాకుండా, దోమల వ్యాప్తి మరియు అంటువ్యాధుల ప్రమాదం కూడా తగ్గే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయ పడ్డారు. రానున్న వర్షాకాలంలో ఇళ్ల ముందు నిలిచిపోయే మురుగునీటి సమస్యకు ఇక ముగింపు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలనీవాసుల వినతికి స్పందించి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడంపై స్థానిక ప్రజలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. "ఎన్నో ఏళ్ల సమస్యకు ఇప్పుడు పరిష్కారం దొరుకుతోంది" అంటూ కాలనీ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు కంచి బిక్షపతి, వేణు, సలావుద్దీన్, రాములు గుప్త, భాగయ్య, నర్సింహా, రెహ్మాన్, లతీఫ్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, మహిళలు, యువకులు, స్థానిక పెద్దలు హాజరై పనుల పురోగతిని పరిశీలించారు.

# ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి**






**ములుగు జిల్లా ప్రతినిధి మే 07 (పీపుల్స్ న్యూస్)** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని, 10వ తేదీలోగా ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్ లు, గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఇండ్ల గణన శిక్షణకు బ్యాచ్స్ హాజరు, సి ఎం ఎం ఎస్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్. జి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందని, స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వీయ గణనపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి పి ఓ ప్రకాష్, ఎస్ ఓ లాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయం సందర్శించిన హైకోర్టు జడ్జి







**(రామప్ప) ములుగు జిల్లా ప్రతినిధి మే 07 ( పీపుల్స్ న్యూస్):** మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వాకిటి రామకృష్ణారెడ్డి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికే ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో ఈవో శాలువాలతో సన్మానించగా అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చరిత్ర శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప సరస్సు సందర్శించారు. వారి వెంట ఎస్సై చల్ల రాజు, ఆర్ ఐ రమేష్, టూరిజం పోలీసులు బద్రు, శ్రీకాంత్, కోర్టు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, టూరిజం, పురావస్తు శాఖల సిబ్బంది ఉన్నారు.

# మిత్రుడి కళ్ళల్లో ఆనందం చూసేందుకే..!

**-అడిగిన వెంటనే ఏలాంటి అర్హత లేకున్న పశువుల కొట్టం మంజూరు**
**-పశువుల కొట్టాల మంజూరులో అర్హులైన లబ్ధిదారులకు మొండి చేయి**
**-ఈజీఎస్ పథకంలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలి**
**-మండల ప్రజల డిమాండ్**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మే 07 (పీపుల్స్ న్యూస్)** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి..ఆ సంక్షేమ పథకాలు వారికి అందే విధంగా చూడాల్సిన కొంతమంది అధికారులు మాత్రం..తన స్నేహితుడి కళ్ళలో ఆనందం చూడడం కోసం ఎలాంటి అర్హత లేకున్న పశువుల కొట్టంను మంజూరు చేసి తన మిత్రుడి కళ్ళలో ఆనందం చూశాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఒక ఈజీఎస్ అధికారి..తన మిత్రుడైన ఓ పాత్రికేయుడు..తన స్నేహాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి బాటలు వేశాడు. ఇంకేముంది ఆ అధికారి పశువుల కొట్టం మంజూరు చేయగానే..తాను పశువుల కొట్టాన్ని నిర్మిస్తున్నట్లుగా..మొదటి విడతగా..కొన్ని రూపాయలను డ్రా చేసుకున్నాడు. దీంతో అర్హులైన లబ్ధిదారులు ఎలాంటి అర్హత లేనటువంటి మీ మిత్రుడికి ఎలా పశువుల కొట్టం మంజూరు చేసావంటూ ఆ ఈజీఎస్ అధికారిని నిలదీయడంతో..పశువుల కొట్టం జాబితా నుంచి తన స్నేహితుడి పేరును కనుమరుగు చేసే కుట్రలు చేశాడు. తన పేరును బయట పెట్టొద్దని, తన పేరు బయటకు వస్తే.. తన జీవనం దెబ్బతింటుందని ఆ విలేఖరి ఈజివిఎస్ అధికారుల వద్ద మొకరిల్లినట్లు తెలియ వచ్చింది. అదేవిధంగా నేటి సమాజంలో విలేకరి అంటే ఒక మంచి గుర్తింపు, మంచి విలువ, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ..ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడడం..అవినీతి అధికారుల బాగోతాన్ని బట్ట బయలు చేయడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి. కానీ మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఓ విలేఖరి అవినీతికి తెరలేపి పాత్రికేయ సమాజం తలదించుకునేలా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విచారణ జరిపించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# వైద్యులు సమయపాలన పాటించాలి... "డాక్టర్ అందుబాటులో లేరు" అనే పరిస్థితి రాకూడదు.

**కలెక్టర్ దివాకర్ టి.యస్**






**ఖమ్మం/మే 07/(పీపుల్స్ న్యూస్ ):**ఆసుపత్రుల్లో వైద్య సేవలతో పాటు పరిపాలనపైనా వైద్యులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నమోదవుతున్న రోజువారీ ఓపీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో పనిచేయని యంత్రాలు ఏవైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో ఉన్న పరికరాల పనితీరుపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ లో భాగంగా ప్రతి పీహెచ్‌సీ స్థాయిలో అవసరమైన ల్యాబ్ పరీక్షా సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం అదనంగా ఒక 108 వాహనం, రెండు 102 వాహనాలు అవసరమని అధికారులు సమావేశంలో తెలిపారు. పాముకాటు నివారణ మందులు అన్ని పీహెచ్‌సీల్లో తగిన నిల్వలో ఉన్నాయని అధికారులు వివరించారు. వైద్యులు వైద్య సేవలతో పాటు పరిపాలనా బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాపై ప్రజల అంచనాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అందరూ సమిష్టిగా నెరవేర్చాలని తెలిపారు. వైద్యులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది రోగులతో ఓర్పుతో, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కఠిన పదజాలం ఉపయోగించకుండా మృదువుగా మాట్లాడాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులు, ఫర్నిచర్‌కు సంబంధించిన అంచనాలను గురువారం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు వ్యయం లక్ష లోపు ఉండే విధంగా ప్రతిపాదనలు రూపొందిస్తే కొటేషన్ ద్వారా నేరుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టవచ్చని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, అదనపు డీఎంహెచ్ఓ చందు నాయక్, ఎన్‌సీడీ పీవో డాక్టర్ అరుణాదేవి, డీఐఓ డాక్టర్ పి. సంపత్, ఐడీఎస్పీ పీవో డాక్టర్ ఐ. మోత్యా, వైద్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణలపై రాజకీయ రగడ.. ఎమ్మెల్యే కృష్ణారావుపై పట్లోళ్ల నాగిరెడ్డి ఫైర్

**-- రోడ్ల విస్తరణకు అడ్డంకులు సరికావు: మాధవరానికి నాగిరెడ్డి హెచ్చరిక**
**-- డబ్బాల రాజకీయాలపై దుమారం.. ఎమ్మెల్యేపై నాగిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు**



**బాలానగర్ మే 08 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ భరత్‌నగర్ కాలనీలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది. నిరుపేదల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించడం సరికాదని, రోడ్ల విస్తరణ మరియు ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారిన ఆక్రమణలను తొలగించడం తప్పనిసరి చర్య అని భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డబ్బాలపై రాజకీయ రంగులు పూసి, గంటల వారీగా అద్దెలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయని నాగిరెడ్డి అన్నారు. "అద్దెలు వసూలు చేసే వసూల్‌రాజాలు ఎవరు? పేదల పేరుతో వ్యాపారం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నది వాస్తవం కాదా?" అని ప్రశ్నించారు. భరత్‌నగర్ కాలనీలో గత పదేళ్లుగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలనీ లోపలికి వెళ్లేందుకు కూడా సరైన మార్గం లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలను తొలగిస్తున్నారని స్పష్టం చేశారు. అయితే ఆక్రమణల తొలగింపుతో ఉపాధి కోల్పోతున్న పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కానీ ప్రజా ప్రయోజనాల కోసం అధికారులు చేపడుతున్న చర్యలకు రాజకీయ అడ్డంకులు సృష్టించడం సమంజసం కాదని నాగిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల రాకపోకలకు అడ్డంకిగా మారిన ఆక్రమణలను తొలగించడం ప్రజాహితం కోసమేనని, దీనిపై అనవసర రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

-- భరత్ నగర్ కాలనీ డివిజన్ గా ఏర్పాటు చేయాలి!

కూకట్ పల్లి సర్కిల్ పరిధిలో ఉన్న ఫతేనగర్ డివిజన్‌ను మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో కలపడంతో పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కావున మూసాపేట సర్కిల్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీని ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల నాగిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించాలంటే భరత్‌నగర్‌కు ప్రత్యేక డివిజన్ అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జనాభా పెరుగుదలతో పాటు స్థానిక సమస్యలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక డివిజన్ ఏర్పాటు ద్వారా ప్రజలకు త్వరితగతిన సేవలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు.

# నేను చెప్పిందే శిలాశాసనం..!

**-ప్రభుత్వ యంత్రాంగాన్ని శాసిస్తున్న ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడు**
**-ఒక రాజకీయ పార్టీ నాయకుడి అండదండలతో ప్రభుత్వ భూమి కబ్జా**
**-ఆక్రమించుకున్న భూమిలో యథేచ్ఛగా పాఠశాల భవనం, ప్రహరీ గోడ, సెప్టిక్ ట్యాంక్, మరుగుదొడ్ల నిర్మాణం**
**- నోటీసులిచ్చిన మహిళా పంచాయతీ కార్యదర్శులపై దురుసుగా ప్రవర్తన**
**-నోటీసుల చించివేత**
**-సర్వేల పేరుతో అధికారుల కాలయాపన**
**-చర్యలు తీసుకోకుంటే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని గ్రామ ప్రజల హెచ్చరిక**

**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మే 07 (పీపుల్స్ న్యూస్):** నేను చెప్పిందే శిలాశాసనమంటూ..ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడు..ఒక రాజకీయ నాయకుడి అండదండలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి..యథేచ్ఛగా ఆ భూమిలో పాఠశాల భవనం, ప్రహరీ గోడ నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్, మరుగుదొడ్లను నిర్మించుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టుతుండడంతో.. మహిళా పంచాయతీ కార్యదర్శులు ఆ పాఠశాల నిర్వాహకుడికి నోటీసులను జారీ చేస్తే..వారి పట్ల దురుసుగా ప్రవర్తించడం, నోటీసులను చించి వేయడం లాంటి సంఘటనలు జరిగితే..ఆ కార్యదర్శులు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వ భూమి అక్రమణ గురించి ప్రజావాణిలో అనేకమార్లు జిల్లా కలెక్టర్ మరియు తహసిల్దార్ లకు గ్రామ ప్రజలు అర్జీలు పెడితే నామమాత్రంగా సర్వేల పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇట్టి భూకబ్జాపై గత వారం రోజుల క్రితం పత్రికల్లో వార్తలు ప్రచురితం కాగా గురువారం సర్వేకు వచ్చిన అధికారులు..భూకబ్జాపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, హద్దులను నియమించకుండా..ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడికి న్యాయం జరిగేలా అధికారులు వ్యవహరించారని, ఈ కుట్ర వెనుక ఓ బలమైన రాజకీయ నాయకుడి హస్తం ఉండడంతో అధికారులు ఏమి చేయలేక నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిసు _న్నారనే ఆరోపణలు మండలంలో గట్టిగానే వినిపిస్తున్నాయి. ఒక ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడికి..ప్రభుత్వ అధికారులను శాసించే ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందని గ్రామంలో తీవ్రంగా చర్చ కొనసాగుతుంది. సర్వేకు వచ్చిన అధికారులు ప్రభుత్వ భూమి ఎంత కబ్జాకు గురైందో కనుక్కొని రైతులకు ఇప్పటికైనా న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకుని వచ్చాం



**రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు ప్రజలకు సేవ చేయడమే జీవిత లక్ష్యం**





**ఖమ్మం/మే07/(పీపుల్స్ న్యూస్ ):**ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం రాజకీయాలకతీతంగా కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పర్యటించి పలు సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణ పనులకు, యుపిఎస్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి, నేతాజీ పార్క్, డి.ఎఫ్.టి. స్కీమ్ క్రింద త్రాగునీరు సరఫరా సౌకర్యాన్ని మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు.

ముందుగా 46 వ డివిజన్ సారథి నగర్ ఆర్.యు.బి వద్ద మున్సిపల్ సాధారణ నిధులు ఒక కోటి 8 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, పంపింగ్ వెల్ 33వ డివిజన్ లో సుడా నిధులు 30 లక్షలతో, 34 వ డివిజన్ లో 53 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణపనులకు, 32వ డివిజన్ గుట్టల బజార్ లో 30 లక్షలతో, 50 లక్షలు సాధారణ నిధులతో సీసీ కాలువల నిర్మాణ పనులకు, 40వ డివిజన్ నిజాంపేటలో 66.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు, 55వ డివిజన్ వేణుగోపాల్ నగర్ లో 101.60 లక్షలతో సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులకు, 50వ డివిజన్ రాపర్తి నగర్ బైపాస్ రోడ్డు వద్ద చౌదరి హోటల్ నుండి రైల్వే కల్వర్టు వరకు ఒక కోటి 50 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు, 15వ డివిజన్ లో 30 లక్షలతో అదనపు గదుల నిర్మాణ, మరమ్మత్తు పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అలాగే 55వ డివిజన్ బ్యాంక్ కాలనీలో 39.40 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్, కల్వర్టు లను, 12వ డివిజన్ లకారం ట్యాంక్ బండ్ వద్ద 49.80 లక్షలతో ఏర్పాటు చేసిన నేతాజీ పార్క్ ను, 15వ డివిజన్ అల్లిపురం లో అమృత్ నిధులు కోటి 60 లక్షలతో నిర్మించిన 9 లక్షల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి వాటర్ ట్యాంక్, మున్సిపల్ నిధులు కోటి 50 లక్షలతో ఏర్పాటు చేసిన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ సరఫరాను మంత్రివర్యులు ప్రారంభించారు. ఖమ్మం ప్రజలు, శ్రీ రామ చంద్ర మూర్తి ఇచ్చిన అవకాశం మేరకు గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని, మొదట ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని, అన్ని పార్టీలలో సముచితమైన స్థానం, గౌరవం తనకు లభించిందని అన్నారు. పల్లె పల్లెకు రహదారి, మంచి నీరు విద్యా, వైద్యం సౌకర్యంతో పాటు భారీ ప్రాజెక్టులు కూడా తీసుకుని వచ్చి ఖమ్మం జిల్లా చరిత్రలో తనకు ఒక పేరు ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరు వచ్చే విధంగా పని చేసామని అన్నారు. నేను తప్పు చేస్తే ప్రజలకు చెడు పేరు వస్తుందని ఒక యజ్ఞం చేసినట్లుగా నిష్టగా రాజకీయం చేస్తున్నానని అన్నారు. జీవితంలో తనకు ఇంతటి గౌరవం తీసుకుని వచ్చిన ప్రజలకు మనస్ఫూర్తిగా పని చేస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఖమ్మం ప్రజల మన్నలను పొందాలని భగవంతుని కోరుకుంటూ ఐదు సంవత్సరాలు విజయ వంతంగా పదవికాలం పూర్తి చేసుకున్న కార్పొరేటర్లకు మంత్రి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రివర్యులు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, డిసిహెచ్ఎస్ గంగాధర్, ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ డిఈ శ్రీనివాస్, ఏఈ నవజ్యోతి, కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


# పవన్ కళ్యాణ్ వెళ్లిన ఆ పురాతన ఆలయానికి మహర్దశ



**అల్లూరి సీతారామరాజు జిల్లా:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో గిరిజన ప్రాంతంలో శివాలయం పునర్ నిర్మాణం కాబోతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ. 55 లక్షల టీటీడీ నిధులతో వర్తనపల్లి శివాలయం పునర్నిర్మాణం చేయనున్నారు.. ఈ మేరకు నిధులు మంజూరయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్చి 14వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతంలోని వర్తనపల్లిలో పర్యటించారు. గ్రామంలో రోడ్లు, డ్రెయిన్లు పరిశీలిస్తున్న సమయంలో కొంతమంది స్థానికులు శివాలయాన్ని సందర్శించాలని కోరారు. పవన్ కళ్యాణ్ స్థానికుల కోరిక మేరకు శివయ్య దర్శనానికి వెళ్లారు.. అయితే శివాలయం శిథిలావస్థకు చేరడాన్ని డిప్యూటీ సీఎం గమనించారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని ఆయన్ను కోరారు.టీటీడీ సహకారంతో వర్తనపల్లిలో శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని వర్తనపల్లి వాసులకు పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం పాడేరు పర్యటన ముగిసిన వెంటనే వర్తనపల్లి శివాలయం నిర్మాణం కోసం టీటీడీకి లేఖ రాశారు. స్థానికులు, భక్తుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరణ పనులు చేపట్టాలని లేఖలో టీటీడీని కోరారు. ఆ వెంటనే టీటీడీ టెక్నికల్ టీమ్ వర్తనపల్లిలో పర్యటించింది. స్థానికుల కోరిక మేరకు శివాలయం పునర్నిర్మాణంతోపాటు సింహవాహనంతో కూడిన అమ్మవారి విగ్రహం, మూషిక వాహనంతో కూడిన గణపతి విగ్రహం, నెమలి వాహనంతో కూడిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం, ధ్వజస్తంభం ఏర్పాటుకు అంచనాలు రూపొందించింది.అలాగే భక్తులు సేదతీరేందుకు బెంచీలు, బోర్ వెల్ తో కూడిన తాగునీటి సౌకర్యం, మైక్ సిస్టం తదితర సౌకర్యాలు కూడా వర్తనపల్లి శివాలయంలో ఏర్పాటు చేసేందుకు టీటీడీ ముందుకు వచ్చింది. వర్తనపల్లిలో శివాలయాన్ని రూ.55 లక్షలతో శివాలయాన్ని పునర్ నిర్మించేందుకు టీటీడీ నిధులు ఇచ్చింది.. ఈ మేరకు టీటీడీ పాలకమండలి సమావేశంలో ఆమోదం తెలిపారు.

# పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు

**అమరావతి, మే 7 :** అభివృద్ధి లేకుంటే సంపద లేదని.. సంపద లేకుంటే సంక్షేమం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మనం అందించే సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ (గురువారం) సచివాలయంలో జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. అధికారులు సమష్టిగా పనిచేసి.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజాసమస్యలను వందశాతం పరిష్కరించాలని మార్గనిర్దేశం చేశారు. ఏపీని పునఃనిర్మిస్తామని తాను, పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ అనేది చాలా ముఖ్యమని చెప్పుకొచ్చారు. అందరి సహకారంతో రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని.. ఇది సమష్టి విజయమని ఉద్ఘాటించారు. ఈ అవార్డు తనకు బాధ్యతతో కూడినది అని.. నిజానికి ఇలాంటి అవార్డులు పాజిటివ్ మూడ్ క్రియేట్ చేస్తాయని వ్యాఖ్యానించారు. మీ అందరి సహకారంతోనే తనకు ఈ అవార్డు వచ్చిందని అన్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారని... ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారనే దానికి ఈ అవార్డు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామస్థాయి అధికారి వరకు పనిచేయడం వల్లే ఈ అవార్డు దక్కిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను తీసుకువచ్చాం..రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను ఏపీకి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. గ్రీన్ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు రూ.23లక్షల కోట్ల ఎంవోయూలు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే జరిగిన ఎంవోయూల ద్వారా 24లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. దేశంలోని అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో



ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. వారానికో కంపెనీ తీసుకొస్తున్నామని.. రోజుకో శంకుస్థాపన చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.ఆ నిధుల డైవర్ట్ చేశారు. .ఏపీ వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పుగా వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. జగన్ హయాంలో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన స్కీముల నుంచి రూ. 10వేల కోట్లు డైవర్ట్ చేశారని ధ్వజమెత్తారు. దీంతో వారు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. రూ.1,30000 వేల కోట్లు అప్పులు చెల్లించకుండా ఉంచేశారని మండిపడ్డారు. ఈ కాన్ఫరెన్స్‌కు రెండు జిల్లాల నుంచి కొత్తగా కలెక్టర్‌లు వచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల మ్యాండేట్ నిన్న కూడా చూశామని... సరిగా పనిచేయకపోతే ప్రజలు ఆదరించరని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యం కారణంగా ఈ సమావేశానికి రాలేకపోయారని. తాము ఇద్దరం కలిసి ఇచ్చిన హామీలు నేరవేర్చాల్సి ఉంటుందని చెప్పారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు ఏపీలో ఏమాత్రం అభివృద్ధి లేకపోయినా ఇప్పుడు చాలా వరకూ ట్రాక్‌లో పెట్టగలిగామని అన్నారు. ఆర్థిక అసమానతలు పరిష్కరించి జీవన ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు.డబ్బును సృష్టించి పనులు చేయించాలి..ప్రజాప్రతినిధులు, అధికారుల కలయికే కూటమి ప్రభుత్వమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో డెలివరీ లీకేజీలు ఎక్కువగా ఉండేవని... ఇప్పుడు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు వెళ్తున్నాయని వివరించారు. జగన్ హయాంలో ఏపీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రోడ్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు కలెక్టర్ రిపోర్టు పంపేవారని.. అయితే వారు ఇప్పుడు పంపక్కరలేదని... తామే పంపిస్తామని అన్నారు. ప్రజాసమస్యలు అన్నింటిని పాజిటివ్‌గా పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవస్థను మ్యానేజ్ చేయడానికి కాదని.. దాన్ని మార్చడానికి ఈ ప్రభుత్వం ఉందని తెలిపారు. డబ్బు లేదనేది నిజం కాదని... డబ్బును సృష్టించి పనులు చేయించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తాం

**అమరావతి, మే 7:** బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకు వచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు.రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని



వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనా పరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని... ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.10 సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 సాకారం: సీఎస్నిర్దేశించుకున్న లక్ష్యాలను రీ-ఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్సరెన్స్ ఉపకరిస్తోందని సీఎస్ సాయిప్రసాద్ అన్నారు. సుపరిపాలనతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ప్రభుత్వ విధానమని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు- సర్వీస్ డెలివరీ అనేది అత్యంత కీలకమైన అంశమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన 10 సూత్రాల ఆధారంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం దచెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన 10ా్వరా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయగలమని తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తేనే అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించగల మన్నారు. విద్య, వైద్యం లాంటి సంక్షేమ కార్య క్రమాలను సమర్థంగా ప్రజలకు అందించా లన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ నిర్ణయాలు తీసుకోవటంలో ఎలాంటి ఉండకూడదని సీఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

# తిరుమల లడ్డూ వివాదం.. ఏకసభ్య కమిషన్ నివేదికపై కమిటీ

**అమరావతి, మే 7:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ జీవో నంబర్ 900ను జారీ చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికలో బయటపడిన అంశాలు, సిఫార్సులను వివరంగా అధ్యయనం చేయాలని ఆదేశించింది. పాలనాపరంగా అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, న్యాయ పరంగా ముందుకు వెళ్లాల్సిన అంశాలపై సూచనలు చేయాలని కమిటీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ఏకసభ్య కమిషన్ నివేది కలోని నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేయాల్సిన



అంశాలను సూచించాలని ప్రభుత్వం తెలిపింది. ఈ సిఫార్సులను అమలు చేసేందుకు తగిన పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కమిటీ సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిటీ తన నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని జీవోలో స్పష్టంగా సూచించింది.

# సింగపూర్‌లో షాపింగ్ కూడా చేయలేదు.



**సింగపూర్ :** ఏపీ మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్న వేళ.. ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత కౌంటర్ ఇచ్చారు. ఏపీ మంత్రుల సింగపూర్ పర్యటన ఎంజాయ్‌మెంట్ ట్రిప్ కాదన్న అనిత.. అదో స్టడీ టూర్ అని తెలిపారు పర్యటనలో తొలిరోజు ఉదయం 11 గంటల నుంచి.. తిరిగి వచ్చే రోజు విమానం ఎక్కడానికి ముందు రెండు గంటల వరకూ క్లాస్‌లోనే ఉన్నామన్నారు. ఈ పర్యటనలో కనీసం షాపింగ్ కూడా చేయాలని మంత్రి తెలిపారు. మరోవైపు సింగపూర్ పర్యటనలో ఎంతో నేర్చుకున్నామని హోం మంత్రి అనిత.. సీఎం చంద్రబాబు నాయుడుకు తెలియజేశారు. గురువారం జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రుల సింగపూర్ పర్యటనపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మాట్లాడిన సీఎం చంద్రబాబు వివిధ అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.నేర్చుకోవటమనేది నిరంతర ప్రక్రియగా అభివర్ణించిన చంద్రబాబు.. అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా సరే స్వీకరించి.. వాటిని అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సింగపూర్‌లో అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న పాలనా విధానాలు.. స్థానిక ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయని.. సింగపూర్‌లోని అత్యుత్తమ విధానాలను ప్రామాణికంగా తీసుకుని మన రాష్ట్రంలోని ఓ జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సింగపూర్ ప్రభుత్వ విధానాల అమలు కోసం 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకో ఎంఓయూ.. వారానికో శంకుస్థాపన జరుగుతోందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వేగంగా పనిచేసి, అంతే వేగంగా అభివృద్ధి చూపించాలని కలెక్ట ర్లకు నిర్దేశించారు. అనేది కేవలం నినాదాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో.. పబ్లిక్ డెలివరీ సైతం అంతే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు.

# టీడీపీ సంచలన నిర్ణయం.. వర్మను పిఠాపురం ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించిన అధిష్టానం


**అమరావతి :** తెలుగుదేశం పార్టీ సంచలన నిర్ణయం తీసు కున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతనిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం టీడీపీ రాజకీయాల్లో కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. పిఠాపురం నియోజవర్గ టీడీపీ ఇంచార్జ్ బాధ్యతల నుంచి వర్మను అధిష్టానం తప్పించినట్లు సమాచారం. వర్మను బాధ్యతల నుంచి తప్పించిన అధిష్టా నం.. పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్న్?న్నాయి. వీలైనంత త్వరగా కమిటీ ఏర్పాటు చేసేందుకు టీడీపీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే తెలుగు దేశం పార్టీ పిఠాపురం ఇంఛార్జ్ బాధ్యతల నుంచి వర్మను తొలగించినట్లు అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.వర్మ మూడు రోజుల క్రితమే ఏపీ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను కలిశారు.. ఇంతలోనే వర్మను పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించడం



చర్చనీయాంశంగా మారింది. పిఠాపురంలో తరచూ జనసేన పార్టీతో విభేదాల కారణంగానే వర్మను పదవి నుంచి తొలగించినట్లు చర్చ జరుగుతోంది. అయితే టీడీపీ అధిష్టానం పిఠాపురం ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు వర్మకు ముందుగానే సమాచారం ఇచ్చారని కూడా ప్రచారం జరుగుతోంది.. ఈ అంశంపై వర్మ స్పందించాల్సి ఉంది.2024 ఎన్నికల ముందు నుంచి పిఠాపురంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పిఠాపుం నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని తెలియడంతో వర్మ అనుచరులు రెచ్చిపోయారు.. అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీలు, జెండాలను తగులబెట్టారు. ఆ తర్వాత టీడీపీ అధిష్టానం వర్మను పిలిచి మాట్లాడటంతో పరిస్థితులు సద్దుమణిగాయి.. చంద్రబాబు వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. అధినేత హామీతో వర్మ పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలుపు కోసం పనిచేశారు.. జనసేన అధినేతతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఘన విజయం సాధించి డిప్యూటీ సీఎం అయ్యారు. కానీ వర్మ ఎమ్మెల్సీ పదవి కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారు.. ఇటీవల టీడీపీ కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీల్లో వర్మను పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించింది.ఇటీవల కాలంలో పిఠాపురం కేంద్రంగా వరుసగా వివాదాలు తెరపైకి వచ్చాయి. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటోలు లేవంటూ వర్మ జనసేన పార్టీ నేతలతో గొడవకు దిగారు. గత నెలలో మరోసారి ప్రభుత్వ కార్యక్రమంలోని ఫ్లెక్సీలో చంద్రబాబు ఫోటో లేదంటూ వివాదం రేగింది.. మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వర్మపైకి దూసుకెళ్లారు. ఈ వివాదం తర్వాత చంద్రబాబు సీరియస్‌గా స్పందించారు.. ఫ్లెక్సీలలో ఫోటోలు లేవని, కుర్చీలు వేయలేదని నేతలు తరచూ వివాదాలు చేయడం సరికాదన్నారు. కొన్ని ఘటనలు చూసి తాను బాధపడ్డానన్నారు.. కూటమి నేతలతో ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. టీడీపీ అధిష్టానం వర్మను కూడా పిలిచి సీరియస్ అయినట్లు వార్తలొచ్చాయి.. ఈ వివాదం తర్వాత వర్మను పార్టీ బాధ్యతల నుంచి తప్పించడం సంచలనంగా మారింది.

# ఐదెకరాల్లో అత్యాధునిక ఫోరెన్సిక్ ల్యాబ్ – రాజధానిలో ప్రారంభం కానున్న రెండో భవన సముదాయం

**అమరావతి :** నేరాలకు చెక్ పెట్టే శాస్త్రీయ శక్తి ఇప్పుడు అమరావతిలో సిద్ధమైంది. చిన్న ఆనవాళ్లే పెద్ద సాక్ష్యాలుగా మారే ఫోరెన్సిక్ సామర్థ్యంతో దర్యాప్తు వేగం, కచ్చితత్వం పెరగనుంది. అంతర్జాతీయ ప్రమాణాల ల్యాబ్‌తో నేంస్థులకు తప్పించుకునే మార్గాలు మరింత కఠినం కానున్నాయి. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు కీలక ఆధారంగా మారాయి. రక్తం, లాలాజలం, వెంట్రుకలు, చర్మ కణాలు వంటి సూక్ష్మ ఆనవాళ్లను విశ్లేషించి డీఎన్ఏ ప్రొఫైలింగ్ ద్వారా నిందితులను గుర్తించడం సాధ్య మవుతోంది. ప్రత్యక్ష సాక్షులు లేని కేసుల్లో కూడా ఈ శాస్త్రీయ నివేదికలు కోర్టుల్లో బలమైన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల్లో తొలగించిన డేటాను తిరిగి పొందడం



దర్యాప్తునకు కీలకంగా మారింది.సీఆర్‌డీఏ భవనం తర్వాత రెండోది : రాజధాని అమరావతిలోని తుళ్లూరు వద్ద ఎన్-14, ఈ-5 జంక్షన్‌లో నిర్మించిన ఫోరెన్సిక్ భవన సముదాయం పూర్తయింది. ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్ ఐదు భవనాల సముదాయంగా సిద్ధ మైంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్య ంతో రూ.252 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తయింది. 2017లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మధ్యలో నిలిచిపోయినా, 2024 తర్వాత మళ్లీ వేగం అందుకుని పూర్తి దశకు చేరుకుంది. త్వరలోనే అత్యాధునిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇది ప్రారంభం కానుంది. సీఆర్‌డీఏ భవనం తర్వాత రాజధానిలో ప్రారంభంకానున్న రెండో భవన సముదాయం ఇదే కావటం విశేషం.రూ.41 కోట్ల ఖర్చుతో పరికరాలు : దేశంలోని ఎనిమిది అత్యాధునిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల్లో అమరావతి ల్యాబ్ ఒకటిగా నిలవనుంది. ఈ ల్యాబ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బాలిస్టిక్ విభాగాలు ప్రత్యేకంగా పనిచేస్తాయి. ఆటోమేటెడ్ ఫింగర్‌ప్రింట్ సిస్టమ్ ద్వారా వేలిముద్రలను డేటాబేస్‌తో సరిపోల్చి నిందితులను గుర్తిస్తారు. కాల్పుల కేసుల్లో తుపాకులు, తూటాల విశ్లేషణ, విషప్రయోగం లేదా మత్తు పదార్థాల కారణాలను నిర్ధారించే టాక్సికాలజీ పరీక్షలు నిర్వహిస్తారు. నార్కోటిక్స్, బయోమెట్రిక్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ వంటి విభాగాలు కూడా దర్యాప్తును మరింత సమగ్రంగా మార్చనున్నాయి. పాత విధానాల్లో నెలలు పట్టే నివేదికలు ఇప్పుడు గంటలు లేదా కొన్ని రోజుల్లో అందేలా సాంకేతికతను వినియోగిస్తున్నారు. వీటిలో అవసరమైన పరికరాలను రూ.41 కోట్ల ఖర్చుతో పోలీసు శాఖ తెప్పిస్తోంది.ఇకపై క్రిమినల్ కేసుల విచారణ సులభతరం.

# దూసుకొస్తున్న ద్రోణి.. రెండు తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన..!



**రాయలసీమ :** భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పులవల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉందని తెలిపింది.ఇక తెలంగాణ విషయానికి వస్తే.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాలవర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

# 'ఆపరేషన్ సిందూర్'పై అమెరికా ఎందుకు ప్రకటన చేసిందో చెప్పండి

ఆపరేషన్ సిందూర్ తొలి వార్షికోత్సవం వేళ కేంద్ర సర్కారుపై కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. భారత సాయుధ దళాలకు తాను వందనం చేస్తున్నానని, అయితే ఆపరేషన్ సిందూర్‌ను, దాని దౌత్యపరమైన పరిణామాలను మోదీ సర్కారు వ్యూహాత్మకంగా నిర్వహించలేక పోయిందని ఆరోపించారు. పాకిస్థాన్ - భారత్ కాల్పుల విరమణపై తొలిసారిగా 2025 మే 10న సాయంత్రం 5.37 గంటలకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటన విడుదల చేశారని ఆయన గుర్తుచేశారు. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ జోక్యం వల్లే భారత్ - పాక్ కాల్పుల విరమణ సాధ్యమైందని మార్కో రూబియో ఆనాడు చెప్పుకున్నారన్నారు. ఈ అంశంపై అమెరికా ఎందుకు ప్రకటన చేయాల్సి వచ్చిందో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని ప్రెసిడెంట్ ట్రంప్ వందలసార్లు వివిధ దేశాల్లో ప్రకటించుకున్నా, ఒక్కసారి కూడా భారత సర్కారు బహిరంగంగా తిరస్కరించలేదని ఆయన తెలిపారు. ట్రంప్‌కు మంచి స్నేహితుడైన ప్రధాని మోదీ సైతం దీనిపై స్పందించలేదని ఎద్దేవా చేశారు. ఈమేరకు జైరాం రమేశ్ ఒక ట్వీట్ చేశారు.వ్యూహాత్మక తప్పిదాలతో ప్రారంభ నష్టాలు




"వ్యూహాత్మక తప్పిదాల కారణంగా ఆపరేషన్ సిందూర్‌లో ప్రారంభ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని 2025 మే 30న చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్‌లో అంగీకరించారు. వెంటనే ఆ వ్యూహాత్మక పొరపాట్లను సమీక్షించుకొని, లోపాలను సరిదిద్దుకున్న తర్వాత పాకిస్థాన్ లోపలికి చొచ్చుకెళ్లి కచ్చితత్వంతో దాడులను చేయగలిగామని సీడీఎస్ ఆనాడు చెప్పారు. ఇండోనేషియాలోని భారత ఎంబసీలో సైనిక ప్రతినిధిగా వ్యవహరించే ఒక అధికారి సైతం 2025 జూన్ 10న జకార్తాలో జరిగిన సదస్సులో కీలక విషయాలను వెల్లడించారు. భారతదేశ రాజకీయ నాయకత్వం ఏర్పర్చిన పరిమితుల వల్లే 2025 మే 7న భారత్ ఒక యుద్ధ విమానాన్ని కోల్పోయిందని ఆ అధికారి వ్యాఖ్యానించారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. చైనాకు మోదీ ప్రభుత్వం లొంగి పోతోంది"ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా కార్యాచరణపరమైన మద్దతును అందించిందని 2025 జూలై 4న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (ఐజూూూ) లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ తెలిపారు. పాక్‌కు కీలకమైన పరికరాలు, మందుగుండు సామగ్రితో పాటు ఇంటెలిజెన్స్ సమాచారాన్ని, శాటిలైట్ ఆధారిత సహాయాన్ని చైనా అందించిందని ఆయన వెల్లడించారు. అయినప్పటికీ లడఖ్‌లో సైనిక గస్తీ హక్కులను భారత్ కోల్పోవడం, రికార్డు స్థాయిలో చైనా నుంచి దిగుమతులు చేసుకోవడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను భారత్ సడలించడం వంటి చర్యలు చైనాకు మోదీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా లొంగిపోతోందనే సంకేతాలను ఇస్తున్నాయి. ఇవి ఆందోళన కలిగించే పరిణామాలు" అని జైరాం రమేశ్ తెలిపారు.పాక్‌ను ఏకాకి చేయ లేకపోయాం"2008 నవంబరులో ముంబయి ఉగ్ర దాడి జరిగిన తర్వాత అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ఏకాకిగా మారింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ విస్తృత దౌత్య ప్రయత్నాలు చేసినా పాకిస్థాన్ ఏకాకిగా మారలేదు. ఇందుకు పూర్తి భిన్నంగా పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ మధ్య సంప్రదింపులు జరిగాయి. మునీర్‌ను ట్రంప్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ప్రపంచంలోనే సరిహద్దు ఉగ్రవాదానికి ప్రధాన స్పాన్సర్ అయిన పాక్, అమెరికా సైనిక సంస్థ నుంచి ప్రశంసలు అందుకుంది. 1999 జులైలో కార్గిల్ యుద్ధం ముగిసిన కొద్ది రోజులకే, నాటి వాజ్‌పేయి ప్రభుత్వం జరిగిన సంఘటనల క్రమాన్ని పరిశీలించి, భవిష్యత్తు కోసం సిఫార్సులు చేయడానికి కార్గిల్ సమీక్షా కమిటీని ఏర్పాటుచేసింది. దేశ వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడు కె. సుబ్రహ్మణ్యం (ప్రస్తుత విదేశాంగ మంత్రి తండ్రి) అధ్యక్షతన ఆనాడు నియమించిన కమిటీలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఈ కమిటీ 2000 జనవరి 7న ఫ్రమ్ సర్‌ప్రైజ్ టు రెకనింగ్ (ఆశ్చర్యం నుంచి లెక్క తేల్చడం వరకు) శీర్షికన తన నివేదికను సమర్పించింది. దీన్ని 2000 ఫిబ్రవరి 23న పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇలాంటి సమీక్షలేవీ కనిపించలేదు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మతతత్వ శక్తులు బలపడవద్దనే.. టీవీకేకు మద్దతుపై కాంగ్రెస్ పార్టీ ప్రకటన

**చెన్నై, మే 7:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ (. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం పార్టీకి మద్దతు ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ఇండికూటమికి గండి కొడుతుందని బీజేపీ నేతలు విమర్శిం చారు. కాంగ్రెస్ మోసం చేసిందని డీఎంకే ఆరోపించింది. ఈ రాజకీయ పరిణా మాల నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్ష ( నేత, ఎమ్మెల్యే ఎస్ రాజేశ్‌కుమార్ గురువారం స్పందించారు.కేవలం తమిళనాడు లౌకికవాద స్వరూపాన్ని కాపాడటం కోసం, రాష్ట్రంలో మతతత్వ శక్తులు బలపడకుండా నిలువరించ ్డం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టంచేశారు. ఎన్నికల తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య రాజేశ్‌కుమార్ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ తన సిద్ధాంతాలను పక్కన పెట్టిందంటూ వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కొన్ని రాజకీయ శక్తులు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రజా తీర్పునకు విరుద్ధమైనదిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని, కానీ తమిళనాడు విస్తృత ప్రయోజనాలు, సామాజిక



సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకునే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లౌకికవాదానికి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, ప్రజాతీర్పును, రాష్ట్ర భవిష్యత్తును పరిగణనలోకి తీసుకునే తమ నిర్ణయం ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు నుంచే తమకు పలు రాజకీయ ఆహ్వానాలు వచ్చాయని, అయినా మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిలోని లౌకిక శక్తులతోనే కలిసి నడిచామని రాజేష్‌కుమార్ గుర్తుచేశారు. కొన్ని రాజకీయ శక్తులు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రజా తీర్పునకు విరుద్ధమైనదిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని, కానీ తమిళనాడు విస్తృత ప్రయోజనాలు, సామాజిక సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకునే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

# 100 మంది ఉగ్రవాదులు హతం 13 విమానాలు,11 ఎయిర్ ఫీల్డ్స్ ధ్వంసం



**జైపూర్:** ఆపరేషన్ సింధూర్‌చేపట్టి నేటికి ఏడాది అవుతోంది. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాధిపతులు ఇవాళ మీడియాతో మాట్లాడారు. ఎయిర్ మార్షల్ అవదేశ్ కుమార్ భార్తి మాట్లాడుతూ మే 7వ తేదీన ఇండియా 9 ఉగ్ర క్యాంపులను టార్గెట్ చేసిందన్నారు. అయితే పాకిస్థాన్ సైనిక చర్యకు దిగడంతో ఆ దాడుల్ని మరింత విస్తరించినట్లు చెప్పారు. 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన ఆధారాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఆ ఆధారాలను పరిశీలించవచ్చు అని భార్తి అన్నారు. పాకిస్థాన్‌కు చెందిన 11 ఎయిర్‌ఫీల్డ్స్‌ను టార్గెట్ చేసినట్లు చెప్పారు. ఆ దేశానికి చెందిన 13 విమానాలను కూల్చినట్లు తెలిపారు. సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ యుద్ధ విమానాన్ని కూడా కూల్చినట్లు ఆయన తెలిపారు. ఆ సంక్షోభ సమయంలో భారత్‌కు ఎటువంటి నష్టాన్ని పాక్ కలిగించలేకపోయిట్లు చెప్పారు.లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ 9 ఉగ్ర క్యాంపుల్లో ఉన్న సుమారు 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పేర్కన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్థాన్‌కు చెందిన వందకుపైగా ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. పాకిస్థాన్ మిలిటరీ చాలా పెద్ద సంఖ్యలో తమ దివంగత సైనికులకు అవార్డులు అందజేసిందని, దీని ద్వారా ఆ దేశ మిలిటరీ చావుదెబ్బ తిన్నట్లు అర్థమవుతోందన్నారు. వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ మాట్లాడుతూ భారతీయ నౌకాదళం తమ యుద్ధ నౌకలను మోహరించడం వల్ల.. పాకిస్థానీ నేవీ, ఎయిర్ ఫోర్స్ వెనుకడుగు వేసిందన్నారు. ఒకవేళ పాకిస్థాన్ మళ్లీ దూసుకొస్తే, దాన్ని తిప్పికొడుతామన్నారు.

# తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించాలి- మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి

**చెన్నై, మే 7:** మిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనం తరం ప్రభుత్వం ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీ యాంశంగా మారాయి. రాష్ట్రంలో ప్రస్తుత పరి స్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రపతి పాలన విధించి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన సూచిం చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడ ియా వేదికైన 'ఎక్స్'లో పోస్టు చేశారు.'విజయ్ పార్టీకి పూర్తి సంఖ్యాబలం లేదు' తాజాగా జరిగి న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ 234 స్థానాలకు గాను 108 సీట్లను గెలుచుకుంది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన 118 స్థానాల మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకా 10 స్థానాలు తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీవీకేకు తగిన సంఖ్యాబలం లేదని శ్రీధర్ వెంబు అభిప్రాయపడ్డారు. ఒకవేళ ప్రభుత్వం ఏర్పాటైనా అంతర్గత విభేదాలు, మద్దతు పార్టీల ఒత్తిళ్లు, రాజకీయ అస్థిరత కారణంగా ప్రభుత్వం ఎక్కువకాలం నిలవకపోవచ్చని ఆయన



వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రజలు స్థిరమైన, సమర్థవంతమైన పాలనకు అర్హులని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రపతి పాలనతో మళ్లీ ఎన్నికలు జరపాలి ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన అమలు చేయడమే సరైన నిర్ణయమని శ్రీధర్ వెంబు సూచించారు. అనంతరం మరోసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల అసలైన అభిప్రాయం బయటపడుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే ఎన్నికల్లో ఓటుకు నోటు వ్యవస్థను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డబ్బు ప్రభావం లేకుండా ఎన్నికలు జరిగితే ప్రజల తీర్పు స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.'మళ్లీ టీవీకేకే ప్రజల మద్దతు'మళ్లీ ఎన్నికలు జరిగితే విజయ్ నేతృత్వంలోని టీవీకే భారీ మెజార్టీతో అధికా రంలోకి వచ్చే అవకాశముందని శ్రీధర్ వెంబు వ్యాఖ్యానించారు. ఒకవేళ డీఎంకే, అన్నాడీఏ ంకేలు టీవీకే ఎదుగుదలను అడ్డుకోవాల నుకుంటే కలిసి పోటీ చేయాలని సూచించారు. అదేవిధంగా భాజపా మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలో నిలవాలని అన్నారు. ఒకవేళ ఒక్క సీటు కూడా రాకపోయినా తమిళనాడులో ఆ పార్టీకి అది కొత్త ప్రారంభంగా మారుతుందని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ మద్దతు ఉన్నా మెజార్టీ దూరమే ఇది ఇలా ఉండగా ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేలు కలిగిన కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ప్రకటించింది. అయినప్పటికీ విజయ్‌కు కావాల్సిన పూర్తి మెజార్టీ ఇంకా దక్కలేదు. మరికొంతమంది ఎమ్మెల్యేల మద్దతు కోసం టీవీకే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుపై గవర్నర్ కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.మరోసారి గవర్నర్? వద్దకుఈ మేరకు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను టీవీకే అధినేత విజయ్ మరోసారి కలిశారు. టీవీకే తరఫున ఎన్నికైన నూతన ఎమ్మెల్యేలతో పార్టీ చీఫ్ విజయ్ ప్రభుత్వ ఏర్పాటు గురించి గవర్నర్?తో మరోసారి చర్చించారు. మరోవైపు ద్రవిడ పార్టీలైన డీఎంకే- అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయనే ప్రచారం జోరుగా జరుగుతోంది. తమ రెండు పార్టీల మధ్య చర్చలు జరుగుతున్నాయని ఏఐఏడీఎంకే వర్గాలు వెల్లడించగా, అలాంటి ఆలోచన లేదని డీఎంకే వర్గాలు స్పష్టం చేశాయి.సందేహంలో తమిళ ప్రజలు దాంతో ఇప్పుడు శ్రీధర్ వెంబు సూచించినట్లుగానే తమిళనాడులో రాష్ట్రపతి పాలన అమలు చేస్తారా, తిరిగి మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా అనే సందేహాలు ప్రజల్లో వెలువడుతున్నాయి. అయితే రాష్ట్రంలో తదుపరి రాజకీయ పరిణామాలు ఎలా ఉండనున్నాయి, ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్? ఎటువంటి నిర్ణయం తీసుకోనున్నారనే దానిపై అన్ని పార్టీల నేతలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మరోసారి గవర్నర్‌కు కలిసిన విజయ్ ప్రమాణ స్వీకారానికి గ్రీన్ సిగ్నల్!

**చెన్నై, మే 7:** తమిళనాడులో రాజకీయ పరిస్థితులు ఎప్ప టికప్పుడు మారుతున్నాయి. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను మరోసారి కలిశారు టీవీకే అధినేత విజయ్. లోక్‌భవన్‌కు చేరుకున్న ఆయన గవర్నర్ కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై మరోసారి చర్చించారు. తమిళనాడులో ప్రభు త్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన గవర్నర్, తమ బలాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా గవర్నర్, విజయ్‌ను పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. 113 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వం ఎలా ఏర్పాటు చేస్తారని గవర్నర్, విజయ్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. కాంగ్రెస్ కాకుండా ఏ పార్టీ మద్దతిస్తోందో చెప్పాలని అడిగినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు గవర్నర్‌ను కలిశారు.నూతన ఎమ్మెల్యేలతో పార్టీ చీఫ్ విజయ్ కీలక భేటీఅటు టీవీకే తరఫున ఎన్నికైన నూతన ఎమ్మెల్యేలతో పార్టీ చీఫ్ విజయ్ కీలక భేటీ నిర్వహించారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.



అంతకుముందు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ బుధవారం విజయ్ గవర్నర్‌కు లేఖ సమర్పించారు. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల పేర్లు ఇవ్వాలని గవర్నర్ కోరినట్లు తెలిసింది. విజయ్ వాటిని సమర్పించకపోవడంతో గురువారం తలపెట్టిన ప్రమాణస్వీకారం కార్యక్రమం రద్దు అయ్యింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లతో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది.భద్రతపై చర్చఇదిలా భద్రత తగ్గించారు. రెండ్రోజులుగా విజయ్ వెంట ఉన్న కాన్వాయ్ తొలగించారు. ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్‌ను అధికారులు తొలగించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేవరకు కాన్వాయ్ ఇవ్వొద్దని విజయ్ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు టీవీకే పార్టీ తెలిపింది. ఈనెల 4న అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెలువడ్డాక అధికారులు విజయ్?కు నాలుగు వాహనాలతో కాన్వాయ్ ఏర్పాటు చేశారు. ఆయన నివాసం వద్ద కూడా భద్రతను పెంచారు. ప్రస్తుతం విజయ్ ఇంటి వద్ద కూడా పోలీసుల మోహరింపు లేదు.రిసార్టుకు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలుమరోవైపు తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొనడంతో అన్నాడీఎంకే తమ ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని రిసార్టుకు తరలించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి కొవై సత్యన్ తెలిపారు. అయితే ఎంత మంది ఎమ్మెల్యేలను తరలించారో ఆయన వెల్లడించలేదు. రిసార్టు తరలింపునకు గల కారణాలపైనా స్పష్టత ఇవ్వలేదు. అన్నాడీఎంకే తరఫున ఎన్నికైన 47 మంది ఎమ్మెల్యేల్లో కొంత మంది విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తమిళనాడు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే తమ ఎమ్మెల్యేలను పుదుచ్చేరికి తరలించినట్లు తెలుస్తోంది. 15 మందికిపైగా ఎమ్మెల్యేలు రిసార్టుకు చేరుకున్నట్లు తెలిసింది. మరికొందరు ఎమ్మెల్యే లు కూడా పుదుచ్చేరికి బయల్దేరినట్లు సమాచారం. అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామి సన్నిహితుడు రాజ్యసభ ఎంపీ సీవీ షణ్ముగం రిసార్టు బుక్ చేసినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని గదులు బుక్ చేయనున్నట్లు అంటున్నారు.డీఎంకే-అన్నాడీఎంకే పొత్తుపై జోరుగా ప్రచారంమరోవైపు ద్రవిడ పార్టీలైన డీఎంకే-అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయనే ప్రచారం జోరుగా జరుగుతోంది. తమ రెండు పార్టీల మధ్య చర్చలు జరుగుతున్నాయని ఏఐఏడీఎంకే వర్గాలు వెల్లడించగా, అలాంటి ఆలోచన లేదని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి.ప్రజాతీర్పును గౌరవిస్తామన్న ఎంకే స్టాలిన్ అటు ప్రజాతీర్పును గౌరవిస్తామని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. తమిళనాడులో రాజ్యాంగ సంక్షోభం కాని, మరోసారి ఎన్నికలను కాని తాను కోరుకోవడం లేదని సూచనప్రాయంగా వివరించారు. అన్నాడీఎంకేతో పొత్తుపై ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పందించారు. టీవీకే కొత్త ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత డీఎంకే పథకాలు కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టీవీకే చెప్పినట్లుగా మహిళకు ప్రతినెలా రూ.2,500 ఇవ్వడం కష్టమైన పనేనని, డీఎంకే ఇచ్చిన రూ.1000 కొనసాగించాలని చెప్పారు. విజయ్ ప్రభుత్వాన్ని ఆరు నెలల పాటు ఇబ్బందిపెట్టబోమని మాజీ సీఎం మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు.

# బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి.. హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ హతం



**అమెరికా-ఇరాన్ :**
అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ, ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తూనే ఉంది. దక్షిణ లెబనాన్ ప్రాంతంలోని హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేస్తోంది. తాజాగా లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడిలో హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ మాలెక్ బల్లౌట్ హతమయ్యారు. ఈ విషయాన్ని హెజ్‌బొల్లా వర్గాలు ధ్రువీకరించినట్టు తెలుస్తోంది .లెబనాన్ దక్షిణం, తూర్పు ప్రాంతాలలో జరిగిన వైమానిక దాడులలో కనీసం 11 మంది మరణించారని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హెజ్‌బొల్లాకు బాగా పట్టు ఉన్న బీరుట్ దక్షిణ శివారు ప్రాంతంలోని ఘోబేరిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడి చేశాయని లెబనాన్ ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. కాగా, హెజ్‌బొల్లా రద్వాన్ దళాల కమాండర్‌ను తమ సైన్యం లక్ష్యంగా చేసుకుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారురద్వాన్ నాయకులు సమావేశం నిర్వహిస్తున్న అపార్ట్‌మెంట్‌పై ఈ దాడి జరిగింది ). దాడి అనంతరం శిథిలాలతో నిండిన ఒక భవనాన్ని, తమ సామానులతో ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్తున్న ప్రజలను చూసినట్టు అంతర్జాతీయ మీడియా విలేకరి పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఇజ్రాయెల్.. లెబనాన్ దక్షిణ ప్రాంతంపై, పదేపదే బాంబు దాడులు చేస్తోంది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ సైనికులపై హెజ్‌బొల్లా దాడులు చేస్తోంది.

# పక్కా ప్రణాళిక ప్రకారమే సువేందు అధికారి పీఏ హత్య



**బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ నేత సువేందు అధికారి సన్నిహితుడు, పీఏ చంద్రనాథ్ రాత్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి అతడిని గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. నార్త్ 24 పరగణాస్ జిల్లాలోని మధ్యగ్రామ్‌లో చంద్రనాథ్‌ను కాల్చి చంపారు. హత్య అనంతరం నిందితులు పారిపోయారు. వారి కోసం ఇంకా వెతుకులాట కొనసాగుతోంది. ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి, విచారణ ప్రారంభించారు.దర్యాప్తు సంస్థలు ప్రాథమికంగా వెల్లడించిన వివరాల ప్రకారం.. పక్కా ప్రణాళిక ప్రకారమే చంద్రనాథ్ హత్య జరిగింది. అతడిపై దాదాపు పది రౌండ్లు, అంతకంటే ఎక్కువే కాల్పులు జరిపారు. ఈ ఘటనతో సంబంధం ఉందని భావిస్తున్న ముగ్గురు స్తానిక రౌడీ షీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటన చాలా పకడ్బందీగా జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల అంచనా ప్రకారం. ముందుగా రెక్కీ నిర్వహించారు. అలాగే, హత్య అనంతరం పారిపోయే రూట్లను ఎంచుకున్నారు.

# ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు- ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభం

**పాకిస్థాన్ :** పాకిస్థాన్‌లోని ఏ ఉగ్రవాద స్థావరం సురక్షితం కాదని 'ఆపరేషన్ సిందూర్' నిరూపించిందని, ఇది ముగింపు కాదని కేవలం ఆరంభం మాత్రమేనని భారత సైన్యం వెల్లడించింది. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌ను శిక్షించడానికి, గత అర్ధ శతాబ్దంలో భారతదేశం చేపట్టిన అత్యంత విస్తృతమైన పోరాట మిషన్‌గా అభివర్ణించింది. ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఏడాది పూర్తైన నేపథ్యంలో అందుకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ త్రివిధ దళాల అధిపతులు జైపుర్?లో సంయుక్త పత్రికా సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు




కాదు ప్రారంభమని వెల్లడి ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యూహాలకు కొత్త పాఠంగా నిలిచిందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ మాట్లాడిన జనరల్ రాజీవ్, సమాచార, నిఘా, దీూఖీ, సైన్యం వంటి అన్ని విభాగాల మధ్య అద్భుతమైన సమన్వయం విజయానికి కారమణన్నారు. ఈ ఆపరేషన్‌లో బ్రహ్మోస్, ఆకాశ్‌తో సహా మరెన్నో స్వదేశీ ఆయుధాలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయన్నా రు. అత్యంత తక్కువ సమయంలో ఒక సంక్లిష్టమైన ఆపరేషన్‌కు ప్రణాళిక చేసి అమలు చేశామన్నారు. ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని చెప్పారు. ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు ని, ప్రారంభమని జనరల్ రాజీవ్ ఉద్ఘాటించారు. పక్కన పెట్టి ఖచ్చితత్వం, సమతుల్యత, స్పష్టమైన లక్ష్యంతో నియంత్రణ రేఖ వెంబడి, పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఇది ఒక దేశం ప్రదర్శించిన సంకల్పం, బాధ్యత, వ్యూహాత్మక సంయమనానికి నిదర్శనం."

# ధాన్యం కొనుగోళ్లలో దబాయింపులు !



ఏటా దేశంలో ధాన్యం కొనుగోళ్లు అన్నది ఓ పజిల్‌గా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నామని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం కొనండి అని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా కొనుగోళ్లు పెద్ద ఎత్తున ఎక్కడా కానరావడం లేదు. దీనికితోడు అకాల వర్షాం రైతుల నెత్తిన పిడుగు పడేసింది. ఇటీవలి అకాల వర్షం నిండా ముంచింది. అన్నదాత రెక్కలకష్టాన్ని నీళ్లపాల్జేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుప్రాంతాల్లో పడిన వర్షం దాటికి, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో తీవ్రమైన గాలులతో అకాల వర్షం కురవడంతో మంథని మార్కెట్ యార్డుతోపాటు ఆయా మండలాల్లోని వ్యవసాయ ధాన్యమంతా మట్టిలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పదిహేను రోజుల కిందటే కోతలు కోసి, ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు పడుతున్న తరుణంలో కోలుకోలేని దెబ్బతీసింది. కొనుగోళ్లు వేగంగా చేస్తే తమ ధాన్యం తడిసేది కాదని కుప్పల చుట్టూ వర్షం నీటిని చూపిస్తూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని మంత్రులు, అధికారులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అసలు ధాన్యమే కొనడం లేదని తెలంగాణలో బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మక్కల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతులు కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందన్నారు. ఎపిలో కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతు న్నాయని మంత్రి అచ్చన్నాయుడు చెబుతున్నారు. మరి లోపం ఎక్కడో తెలియడం లేదు. కేంద్రం కూడా దేశంలో ఏయే పంటలు పండుతున్నాయో, వాటిని ప్రజలకు చేర్చడమెలా అన్నది ఆలోచన చేయడం లేదు. పంటలు బాగానే పండుతున్నాయి. గోదాముల్లో ఫుల్లుగా ఉంటున్నాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావడం లేదు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాల్లో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగ దారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు మధ్యలో ఉన్న కొద్ది మంది దళారులు మాత్రమే. పంజాబ్, హర్యానాల్లో గోధుమలు బాగా పండిస్తారు. గోధుమల ధర తగ్గితే సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.

లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరి స్తుంటారు. దేశంలో ప్రతి పంట పరిస్థితి ఇలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, మక్క రైతులు నాన కష్టాలు పడుతున్నారు. దీనికంతటికి కొనుగోలు విధానాలు, మద్దతు ధరల విధానాలు సక్రమంగా లేకపోవడమే అని గుర్తించాలి. దీనిని సంస్కరిస్తే తప్ప రైతులకు, వినోగదారులకు మనశ్శాంతి ఉండదు.

# గోధుమ ధరల పతనం

**• పిండి ధరలు మాత్రం పైపైకి**



**న్యూఢిల్లీ,మే7:** గోధమ ధరల పతనం రైతులను ఆందోళన కలిగిస్తోంది. మద్దతు ధరలు ఉన్నా, ఉత్పత్తి పెరిగిన కారణంగా ధరలు పడిపోతున్నాయి. దీంతో పలు రాష్ట్రాల్లో గోధులమలు పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓ వ్యాపారి సమాధాన మిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది. గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొ÷-టటెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు.

# నిధులు లేని కార్పోరేషన్లకు చైర్మన్ల నియామకం

**• బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయడం తగదు: వేముల**

**నిజామాబాద్,మే7:** సీఎం రేవంత్‌రెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంపై లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దకుతుందని విమర్శించారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కుమ్రంభీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం, వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు.కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సంక్షేమం కంటే అనుచరులను సంతృపిపరచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లు ప్రకటించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరికొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదమని ఆక్షేపించారు. నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన చైర్మన్లు ప్రజలకు ఒక రూపాయి కూడా సాయం చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకుగాను 21 కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా ఇవ్వకుండా వాటి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ లో నిలదీస్తే సరైన సమాధానం లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకోవడం మానేసి, ఆయా కులాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.




# 12న అసోంలో ప్రభుత్వ ఏర్పాటు



**గౌహతి,మే7:** అస్సాంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఘన విజయం సాధించింది. దీంతో అక్కడ వరుసగా మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. మే 12న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరనుందని అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కోటా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతోపాటు, పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత ముఖ్యమంత్రలు, డిప్యూటీ సిఎంలు హాజరుకానున్నారు. గౌహతిలోని ఖానాపారాలోని వెటర్నరీ ఫీల్డ్ అంటే ప్రతిష్టాత్మక వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుందని ఆయన తెలిపారు. కాగా, సిఎంగా మూడోసారి హిమంతబిశ్వ శర్మ ప్రయాణస్వీకారం చేయనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రం నుంచి పరిశీలకుడిగా జెపి నడ్డాను బిజెపి అధిష్టానం నియమించింది. ఇప్పటికే హిమంతబిశ్వశర్మ తన సిఎం పదవికి రాజీనామా చేశారు.

# కేరళకు చేరుకున్న కాంగ్రెస్ పరిశీలకులు


**ముఖ్యమంత్రి అభ్యర్థిపై తర్జనభర్జనలు**



**తిరువనంతపురం,మే7:** కేరళంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఫలితాలు వెలువడి మూడు రోజులు గడిచినప్పటికీ.. సిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ 63 స్థానాలను గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) 22 స్థానాల్లో విజయం సాధించింది. కేరళం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తన మొదటి శాసనసభ పక్ష సమావేశాన్ని తిరువనంతపురంలో గురువారం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వి.డి. సతీసన్, కె. సురేష్, దీప్‌దాస్ మున్షీ సహా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులైన ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్‌లను కలిసేందుకు తిరువనంతపురం లోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్ మీడియాతో మాట్లాడారు. ఈ చర్చలు కాంగ్రెస్ హైకమాండ్ ప్రక్రియలో ఒక భాగమని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా, రాకపోయినా సిఎల్ పి నేతను ఎంపికే చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలకులను పంపుతుందని అన్నారు. ఇదే పక్రియ కేరళలోనూ చేపట్టనున్నారని అన్నారు. హైకమాండ్ ఇద్దరు అత్యంత సీనియర్ నాయకులను, వర్కింగ్ కమిటీ సభ్యులను పరిశీలకులుగా నియమించిందని అ న్నారు. గతంలో కేరళ బాధ్యతలు చేపట్టిన, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉన్న సీనియర్ నేత ముకుల్ వాస్నిక్, ప్రస్తుతం ఏఐసీసీ కోశాధికారిగా ఉన్న అజయ్ మాకెన్లను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. వారు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతలతో చర్చలు జరపనున్నారని అన్నారు. చర్చల అనంతరం హైకమాండ్‌కు ఒక నివేదికను పంపనున్నాని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా, హైకమాండ్ సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాత, ముఖ్యమంత్రి అభ్యర్థిపై తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

# రైతుల సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత

- రైతు సంక్షేమంపై కేటీఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడమే బిఆర్ఎస్ పని



**హైదరాబాద్, :** హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్పీ కార్యా లయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసన సభ్యు లు చింతకుంట విజయరమణ రావు గారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పై మరియు కాంగ్రెస్ ప్రభుత్వం పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రైతు సంక్షేమం గురించి కేటీఆర్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని అన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ ఏలుబడిలో ఏనాడు రైతు సమస్యలను, రుణమాఫీ ని పట్టించుకోని కెసిఆర్, కేటీఆర్ లు ఈరోజు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎమ్మెల్యే విజయరమణ రావు దుయ్యబట్టారు. ఏకకాలంలో దాదాపు 20వేల కోట్ల రూపాయలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి దేశంలో చరిత్ర సృష్టించిందని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 12 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని కేటీఆర్ అబద్దాలు మాట్లాడటం ఆయన నైజాన్ని తెలియజేస్తుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన రుణమాఫీ జరిగిన తీరు రైతులు చెప్తారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లు పండిస్తే క్వింటాలుకు 500 చొప్పున 1740 వేల కోట్ల బోనస్ ను చెల్లించి రైతులను ఆదుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో నష్టాన్ని భరిస్తూ కూడా మార్క్ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేస్తూ మద్దతు ధర చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నదని చెప్పారు. రైతు సంక్షేమమే ఊపిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తానన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పండించిన పంటలో గింజ కటింగ్ లేకుండా చేస్తూ సన్న రకం వడ్లకు 500 రూపాయలు బోనస్ అందించి రైతులను కాపాడుతున్నామని అన్నారు. ఈ ప్రెస్ మీట్లో ప్రభుత్వ విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి గారు మరియు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గార్లు పాల్గొన్నారు.

# పదిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక క్యాంప్

- విజయవంతం కోసం ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి



**మహబూబాబాద్ జిల్లా, :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మే 12 నుంచి జూన్ 3 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం రెమెడియన్ టీచింగ్ కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తొర్రూరు మండల వ్యాప్తంగా మొత్తం 16 మంది విద్యార్థులు పదో తరగతిలో ఫెయిల్ అయినట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్ విజయవంతం అయ్యేలా అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుండి 17 వరకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట, పిటిఎం మీటింగ్, విద్యార్థుల ఎన్రోల్మెంట్, ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గూర్చి విస్తృత ప్రచారం వంటి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభం నుండే అల్పాహార పథకం కూడా ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలియజేశారు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఉపాధ్యాయులమంతా మన వంతు పాత్ర పోషించాలని సూచించారు.

# రైతు సంక్షేమంపై ప్రతిపక్షాల విమర్శలు ప్రజలు నమ్మరు

- రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం
- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ, :** హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం--వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గార్లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చెమటోడ్చి భూమిలో విత్తనాలు నాటి, వాటిని పంటలుగా మార్చి దేశానికి అన్నం పెడుతున్న గొప్ప వ్యక్తి రైతన్న అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. రైతు కష్టానికి గౌరవం ఇచ్చే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రభుత్వం రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి రైతులకు ఊరటనిచ్చిందన్నారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ఇందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ పనిముట్లపై 50 శాతం సబ్సిడీ అందిస్తూ రైతుల భారం తగ్గిస్తున్నామని తెలిపారు. రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఇలాంటి మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని, వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించి రైతులు పంటల మార్పిడి విధానాలను అనుసరించాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతుల మధ్యకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమని, దీని ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, ఇప్పుడు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ప్రతిపక్షాలపై ఎంపీ మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులు, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమంపై ప్రతిపక్షాల విమర్శలు ప్రజలు నమ్మరు

- రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం
- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది
- మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య



**హనుమకొండ, :** హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం--వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గార్లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చెమటోడ్చి భూమిలో విత్తనాలు నాటి, వాటిని పంటలుగా మార్చి దేశానికి అన్నం పెడుతున్న గొప్ప వ్యక్తి రైతన్న అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. రైతు కష్టానికి గౌరవం ఇచ్చే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రభుత్వం రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి రైతులకు ఊరటనిచ్చిందన్నారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ఇందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ పనిముట్లపై 50 శాతం సబ్సిడీ అందిస్తూ రైతుల భారం తగ్గిస్తున్నామని తెలిపారు. రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఇలాంటి మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని, వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించి రైతులు పంటల మార్పిడి విధానాలను అనుసరించాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతుల మధ్యకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమని, దీని ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, ఇప్పుడు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ప్రతిపక్షాలపై ఎంపీ మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులు, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఎఫ్డీవో,ఇన్చార్జ్ డీఆర్వో

- బాధితుడి నుంచి రూ.3.5 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, :** భద్రాచలం అటవీ శాఖలో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. భద్రాచలం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్డీవో) సుజాత, చర్ల ఇన్చార్జ్ డీఆర్వో కృష్ణయ్యలు ఏసీబీ అధికారుల వలకు చిక్కారు. బాధితుడి నుంచి రూ.3.5 లక్షల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు వారిని రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో ఈ అవినీతి వ్యవహారం బయటపడింది. వారు తెలిసిన వివరాల ప్రకారం భద్రాద్రి జిల్లా చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్లను తొలగించినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం ఎఫ్డీవో సుజాత బాధితుల నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం మొదటి విడతగా రూ.3.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి సుజాతతో పాటు చర్ల అటవీ శాఖ ఇన్చార్జ్ అధికారి కృష్ణయ్యను అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన అధికారులను విచారిస్తున్నామని, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు

# అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు దక్కేనా

- కలెక్టర్ కొరియా చూపాలని స్థానిక ప్రజల అభిప్రాయం



**మహబూబాబాద్ జిల్లా, :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రంలో గత ప్రభుత్వం గోపాలగిరి రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి గృహాలకు అందించాల్సిన సౌకర్యాలను గూర్చి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు .రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరులో పేదలకు డబుల్ బెడ్ రూములు పంపిణీ చేయాలని భావిస్తున్న తరుణంలో కలెక్టర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గత ప్రభుత్వంలో నిజమైన పేదలకు కాకుండా ఇదివరకే ఇండ్లు, అన్ని సౌకర్యాలు ఉన్న మంచి స్థాయి కలిగిన వ్యక్తులకు డబుల్ బెడ్ రూములు దక్కాయని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈసారైనా నిజమైన అర్హులకు దక్కేనా అని తొర్రూరు పట్టణ కేంద్రంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఈ కార్యక్రమంలో తొర్రూర్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు తొర్రూరు మున్సిపల్ మేనేజర్ కట్ట స్వామి, స్థానిక అధికారులు పాల్గొన్నారు

# అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి



**గురజాల,** గురజాల నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం అల్లూ రి సీతారామరాజు 102 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత స్వతంత్ర చరిత్రలో ఒక మహోజ్వల శక్తి ఇతడు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయంఅని గురజాలనగర పంచాయతీ కమిషనర్ వై వి ఎల్ శివన్నారాయణ అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలు అర్పించిన యోధుడు అని అన్నారు. ఆయన కేవలం 27 సంవత్సరాలు వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు ఆయన అనుచరులతో చాలా పరిమిత వనరులతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మహాశక్తిని ఢీకొన్నాడని ఆయన తెలియజేశారు.ఈ వర్ధంతి వేడుకలలో నేలవల్లి బొల్లయ్య జినగా దావీదు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితి 10లక్షలకు పెంపు

- వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరణలో మంత్రి సీతక్క



**హైదరాబాద్, :** హైదరాబాద్లోని జ్యోతిబాపూలే ప్రజా భవన్లో 2026-27 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. మహిళా సంఘాలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ రూ. 10 లక్షల వరకు ఉండే రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది. మహిళా సంఘాల వడ్డీ భారం తగ్గించేందుకు ఈ ఏడాది ప్రభుత్వం రూ. 2,500 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు రూ. 26,621.47 కోట్ల రుణ సదుపాయం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళా సంఘాల రుణాల మొండి బకాయిలు కేవలం 1.40 శాతంగా ఉండటం వారి క్రమశిక్షణకు నిదర్శనమని మంత్రి కొనియాడారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లా జీరో ఎన్ పి ఎ సాధించడంపై ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటికే 40% పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకే అప్పగించామని సీతక్క పేర్కొన్నారు. మహిళలు కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా, 'ఇందిరా మహిళా శక్తి' ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మరియు పలువురు బ్యాంకింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే ఫలితాలు మెండు



వరంగల్ : ఔను, సర్కారు బడులే సో బెటరు! అని తేటతెల్లం ఔతుంది. గత పాతికేళ్ళుగా పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాన్రానూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే ర్యాంకుల పంట పండుతోంది. మంచి మార్కులు పొందిన విద్యార్థుల ఇళ్ళకే ఉపాధ్యాయులు వెళ్లి మిఠాయిలను పంచి, సత్కరించి రావడం ఒక గొప్ప శుభ పరిణామం. మరో అడుగు ముందుకేసి ఆ పిల్లలతోనే ర్యాలీలు చేస్తున్నారు గురువులు.అదే విధంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో తమ తమ పిల్లలను చేర్పించండి అంటూ పేరెంట్స్ కు అవగాహన పర్చే దిశగా ఉపాధ్యాయలోకం దూసుకుపోతుంది. ప్రత్యేక ఆదేశాలు లేకపోయినా స్వచ్ఛందంగా ఉపాధ్యాయులే ఎండనక వాననక ఇళ్ళవద్దకే వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వివరించుట విశేషం. ప్రజలు కూలీలు ఊరవతల చెరువుల వద్ద పనులు చేసుకుంటున్న సందర్భాలలో సైతం, అక్కడికి వెళ్లి మరీ తమ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించండి అంటూ ఉపాధ్యాయ బృందము కోరుచున్నారు. జి.సిగడాం మండలం పాలఖండ్యాం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయని ఆర్.ఎల్.కుమారి, ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, ఉప్పలపాటి ఆదిలక్ష్మి, యెందువ వెంకటరమణ, వెలగాడ రాము, ముల్లు సుజాత, ఎం పెంటయ్య, జిఎంఆర్ విఎఫ్ వాలంటీర్ పిల్లలు దాలమ్మలు అవిశ్రాంతంగా గ్రామంలో పర్యటిస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ఎఫ్ ఎల్ ఎన్ తర్ల్ బోధనాభ్యసనా సామగ్రి, డిజిటల్ బోధన, ఆంగ్ల మాధ్యమం, కృత్యాధార బోధన, యోగా, సైన్స్ ఫేర్, సాంస్కృతిక కార్యక్రమాలు, మెగా పీటీఎం, జాతీయ పర్వదినాల వంటి గుణాత్మక విద్యా సామర్థ్యాలతో తమ ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులందరూ ఎంతగానో శ్రమిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు ఆర్.ఎల్.కుమారి తెలుపుతూ అవగాహన పర్చుచున్నారు. ఆకర్షణీయమైన తరగతి గదులతో పాటు, మంచి నీటి సౌకర్యం, పరిశుభ్రమైన టాయిలెట్లు, వంటగది వంటి సౌకర్యాలను ఆమె ఉదహరిస్తున్నారు. ఆటపాటలు, గ్రంథాలయ పుస్తక పఠనం, తల్లికి వందనం పథకం, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర వంటి కార్యక్రమాలలో గల ఆవశ్యకతను ఆర్.ఎల్.కుమారి సమగ్రంగా వివరిస్తున్నారు. అంతే కాకుండా ఈ పాలఖండ్యాం ఉపాధ్యాయులంతా ఉదయం పూట 8నుండి 9వరకూ వాతావరణం చల్లగా ఉండే సమయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. కనీస అభ్యసన స్థాయి అందించేలా మిక్కిలి కృషి చేస్తున్నారు. అలాగే అన్ని పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఇదే విధమైన కృషి జరుగుతోంది. వంగర మండలం, రుషింగి ఎంపియుపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న బత్తుల వినీల కుమారితో పాటు సహోపాధ్యాయులంతా గ్రామస్థులను కలిసి తమ ప్రభుత్వ బడులలో చేర్పించాలని చెబుతున్నారు. ప్రభుత్వ బడిని అనగా మన ఊరి బడిని కాపాడుకోవాలని, సర్కారుబడులను బలోపేతం చేయుట గ్రామస్తులందరి బాధ్యత అని వినీల కుమారి పిలుపునిచ్చారు. ఇదే విధంగా రాష్ట్రమంతటా గురుబ్రహ్మలంతా తమంతట తామే బాధ్యతపడి వేసవి ఎండలకు లెక్క చేయకుండా తాము పనిచేస్తున్న గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను పెద్దలను కలిసి ప్రభుత్వ బడిలో చేరు బంగారు భవితను కోరు అంటూ నినదిస్తున్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడం : గురువారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ప్రతి నెలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే గురువారం గోడౌన్‌ను పరిశీలించినట్లు తెలిపారు .తనిఖీలో భాగంగా సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి, కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థలను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. అనుమతి లేని వ్యక్తులను గోడౌన్ పరిసరాల్లోకి అనుమతించరాదని భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు.ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్ డి ఓ మధు,ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో అటవీ శాఖ పెద్ద తలలు

**– రూ 3. 5లక్షలు లంచం తీసుకుంటు చిక్కిన భద్రాచలం ఎఫ్ డి ఓ, డి ఆర్ ఓ**




భద్రాద్రి కొత్తగూడెం : ఒక రోడ్డు వేస్తుండగా కొన్ని చెట్లు కట్ కావడం తో వాటి గురించి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి ఓ సుజాత రూ పది లక్షలు డిమాండ్ చేసి గురువారం రూ 3.5 లక్షలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఆమెను, చర్ల ఇంచార్జ్ డి ఆర్ ఓ కృష్ణయ్య ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతం లో రోడ్డు వేస్తుండగా పొరపాటున చెట్లు దెబ్బ తిన్నాయి ఈ ఎపిసోడ్ లో ఎఫ్ డి ఓ సుజాత పది లక్షలు డిమాండ్ చేసి భద్రాచలం కార్యాలయం లో 3.5 లక్షలు లంచం తీసుకుంటు డి ఆర్ ఓ తో పాటు పట్టుబడ్డారు.గతం లో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మూడున్నర లక్షలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. అటవీ శాఖ లో అవినీతి పేరుకుపోయింది.ం

# మే 13 న ఉపాధి కార్మికులు సమస్యలపై ధర్నా



భద్రాద్రి కొత్తగూడెం : ఉపాధి పనికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి పని చేయలేని పరిస్థితికి తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వం మే 13న సమస్యలపై ధర్నాపాత పద్ధతులనే పనిని చేపించాలని డిమాండ్ బూర్గంపాడు మండలం శ్రీరాంపురం ఎస్టి కాలనీలో పనిచేస్తున్న ఉపాధి కార్మికుల్ని సందర్శించిన జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు వారు మాట్లాడుతూ విబీ జీ రామోజీ పేరుతో ఉపాధి పనిని ఉపాధి కార్మికులకు అందుకున్న చేయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వం పనిచేయలేని పరిస్థితి కళు ృ కెమెరా సెల్ లో కనపడాలి లేనిపక్షంలో వారికి పని లేదు ఇంటికి పొమ్మంటున్నారు కాలుతున్న మంచినీళ్లు తాగి ఆ పని చేసిన ఇంత మట్టికి వేతనాలు ఇవ్వలేదు ఏప్రిల్ నెలలో చేసిన డబ్బులు రాలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు 125 రోజులు పని చేయాలని ప్రభుత్వం ప్రకటించింది కానీ 35 నుండి 50 రోజులు పని చేస్తేనే వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అందుతాయి తప్ప లేకపోతే అవి అందే పరిస్థితి లేదని ప్రభుత్వం చెబుతోంది ఉపాధి పని అసలుకే చూపించడం లేదు పనులు ఎక్కడున్నాయని అంటున్నారు మరి పని ఏడ చేయాలి ఉపాధి కార్మికులు వాళ్ళకి ఇచ్చిన టార్గెట్ చేయటానికి పని చూపించబోక మళ్లీ టార్గెట్ ని ఇచ్చారు ఇది చాలా దారుణమైన పరిస్థితి అందుకు పాత పద్ధతిలోనే పని చేయించాలని

తెలంగాణ రాష్ట్రం రేవంత్ రెడ్డి ఆర్ గ్యారంటీలు పూర్తిగా అమలు చేయాలని ఉపాధి కార్మికులకి భూమిలేని వారికి జాబ్ కార్డు ఉన్నవారికి 12000 వెంటనే ఇవ్వాలని 2500 మహిళలకు ఇవ్వాలని ఇందిరమ్మ ఇల్లు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి గ్రామసభలో ప్రకటించాలని గ్రామసభ ద్వారా లబ్ధిదారులకు ఇవ్వాలని స్థలం లేని వారికి స్థలం ఇస్తూ ఇంద్రమ్మ ఇల్లు కట్టించాలని కోరారు పింఛన్లు 4000 వెంటనే అమలు చేయాలని వికలాంగులకు 6000 అమలు చేయాలని తులం బంగారం పెండ్లి చేసుకున్న వారికి కానుక వెంటనే ఇవ్వాలని అందుకు మే నెల 13న బూర్గంపాడు ఎంపీడీవో ఆఫీస్ ముందు ఈ సమస్యల పైన పెద్ద ఎత్తున ధర్నా ఉంటుందని మండల వ్యాప్తంగా సమస్యల పైన బూర్గంపాడు ప్రజలు రావాలని కోరుతున్నారు ఉపాధి పనిని కాపాడుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ పాల్గొన్నవారు బానోత్ తార ,లక్ష్మి ,స్వర్ణ, సత్యవతి ,బోడ లక్ష్మణ్ ,వెంకట్ ,అంకిరెడ్డి ,మహేశ్వరి, త్రివేణి ,ఉషారాణి, రంజాన్ బేగం,

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక , విద్యుత్ శాఖ



భద్రాద్రి కొత్తగూడెం, మే 7 : ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు, విద్యుత్ శాఖ చే అమలుపరుస్తున్న పలు పథకాలు, అనగా గృహజ్యోతి, ౹ావీజీఖ+ూా, ౹ావీఖఖూఖవీ, ప్రజా బాట, విద్యుత్ వినియోగదారులకు మరియు రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, విద్యుత్ ప్రమాదాలపై రైతులకు మరియు విద్యుత్ వినియోగదారులకు అవగాహన మరియు వీటిపై విద్యుత్ శాఖ తీసుకున్నటువంటి భద్రతా చర్యలు మొదలగునవి వివరించడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముల్కలపల్లి మండల అగ్రికల్చర్ ఆఫీసర్, మండలంలోని సర్పంచులు, అధికారులు, విద్యుత్ సిబ్బందిమరియు మండల విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా సమితి ప్రచురణార్థం

- రైల్వే ఉద్యోగాల కోతలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ పోస్ట్‌కార్డు ఉద్యమం
- ప్రధాని ఁ రైల్వే మంత్రికి వేలాది పోస్టుకార్డులు- యువత ఆగ్రహం వెల్లువ
- రేపు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రైల్ నిలయం ముట్టడి
- వలి ఉల్లా ఖాద్రీ /కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్
- రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

వరంగల్ : భారత రైల్వేలో 2% ఉద్యోగాల కోత (సుమారు 29,608 పోస్టులు) నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఇప్పటికే ఉన్న మూడు లక్షల ఖాళీలను భర్తీ చేయాలని,
పెండింగ్ లో ఉన్న ఆర్ఆర్ బీ పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించబడింది. ఈసీఐఎల్ లోని పలు కోచింగ్ సెంటర్లను సందర్శించి అభ్యర్థులు , నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ ప్రధాని మరియు రైల్వే మంత్రికి వేలాది పోస్టుకార్డులు పంపారు. ఈ పోస్టుకార్డుల ద్వారా రైల్వే ఉద్యోగాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ రైల్వేలో మొత్తం 14,80,455 పోస్టులు ఉంటే, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది సుమారు 10 లక్షలు మాత్రమే వున్నారని, ఖాళీలు: 3--4 లక్షల పోస్టులు ఉన్నాయని, రైల్వే బోర్డ్ తీసుకున్న ప్రస్తుత నిర్ణయంతో 2% ఉద్యోగాల కోత (29,608 పోస్టులు) తగ్గుతాయన్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా, మరోవైపు ఉద్యోగాలను తగ్గించడం యువత భవిష్యత్తుపై నేరుగా దాడి అని ఏఐవైఎఫ్ విమర్శించింది. లక్షల ఖాళీలు ఉన్నప్పుడు నియామకాలు ఎందుకు చేపట్టడం లేదు?, ==దీ పరీక్షల ఫలితాలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, ఉద్యోగాలను పెంచాల్సింది పోయి ఎందుకు తగ్గిస్తున్నారు? ఇది సంస్కరణనా? లేక ఉద్యోగాల నిర్మూలననా? దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అందుకే ఏఐవైఎఫ్‌రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2% ఉద్యోగాల కోత నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని, ==దీ పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని, యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ యువజన వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించకపోతే, దేశవ్యాప్తంగా భారీ స్థాయి ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని వారు హెచ్చరించారు. మే 8న హైదరాబాద్ లోని రైల్ నిలయం ముట్టడి నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రదీప్,అజీమ్, కిరణ్, భరత్, నదీమ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రెస్ మీట్



, నల్గొండ : 2,100 ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నాం అందులో చెరువులు పార్కులు ప్రభుత్వ భూములు ఉన్నాయి .ఇప్పటివరకు 30 వేల ఫిర్యాదులు వచ్చాయి .ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి సైతం హైడ్రా అమలు చేయాలని ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు చేపడతాం.దేశంలోనే మొదటిసారి తెలంగాణ ప్రభుత్వం హైడ్రా పాలసీని అమలు చేసింది. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి ఇటీవల కాలంలో అమీన్పూర్ లో కూడా ముఖిమ్ సంధ్య శ్రీధర్ రావు, మల్లారెడ్డి సంబంధించిన భూములను సైతం స్వాధీనం చేసుకున్నాం. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పరిగణంలోకి తీసుకొని చట్ట ప్రకారమే ఎదుర్కొంటాం ఎంఐఎం, కాంగ్రెస్ ప్రతిపక్షాలకు సంబంధించిన అక్రమ కట్టడాలను సైతం కూల్చి వేశాం.ప్రస్తుతం హైదరాబాదులో 25 చెరువులు స్వాధీనం చేసుకున్నాం.మరో 100 చెరువులు స్వాధీనానికి ప్రణాళిక రూపొందించాం .దీంతో పర్యావరణం ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు వాకింగ్ ట్రాక్, ఫిజికల్ యాక్టివిటీస్ పార్కులు ఎంతో ఉపయోగపడతాయి ఇవన్నీ రెండు సంవత్సరాల లోపు పూర్తి చేస్తాం.

# ముఖ్యమంత్రి , రాహుల్ గాంధీ ని విమర్శించే స్థాయి నీకు లేదు కే. టి. ఆర్.

వరంగల్ : లో రైతు సంగ్రామ సభ పేరు తో రెండు రోజులు విహారయాత్ర కి వచ్చి వెళ్లిన చిన్న దొర మరొక్కసారి దొర అహంకారాన్ని ప్రదర్శించి వెళ్ళాడు.. తన స్థాయి ని మర్చి రాహుల్ గాంధీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను అమర్యాద గా మాట్లాడితే నువ్వేమి పెద్ద లీడర్ వి కావు..వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం ప్రజా ప్రభుత్వం రాగానే 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్లు రుణ మాఫీ చేసింది మీ కండ్లకు కనపడుటలేదా కేటీఆర్?
వరి వేస్తె ఉరే అన్న మీ నాయన కేసీఆర్.. మా ప్రజా ప్రభుత్వం వచ్చాక సన్న వడ్లు పండించిన రైతులకు 500/- బోనస్ ఇచ్చింది నీకు కనపడుటలేదా ?మీ 10ఏండ్ల పాలన ల ఏనాడూ అయినా రైతులకు గిట్టుబాటు ధర ఇయ్యాలే అన్న సోయి కూడా మీకు రాలేదు కదా..పైగా మేము ఇస్తున్నందుకు మీకు ఎందుకు కడుపు మంట?
2014 లో రాష్ట్రాన్ని మీకు అప్పచెప్పే టైం కి 70వేల కోట్ల మిగులతో ఇస్తే 7లక్షల కోట్ల అప్పులు చేసి పోయిన కూడా మేము వచ్చినాక భారం అయినా కూడా రైతు భరోసా ఎకరా కి 12000/- ఇస్తున్నది కనపడుటలేదా?5 లక్షల రైతు భీమా కనపడుటలేదా?
మీరు ఇవ్వకుండా ఎగకొట్టిన రైతు పనిముట్లకు సబ్సిడీ ప్రజాప్రభుత్వం సబ్సిడీ లో ఇస్తున్న పరికరాలు మీకు కనపడుట లెవా?
రైతులకు ఇస్తున్న నాణ్యమైన ఉచిత విద్యుత్ కనపడుతలేదా?
మీరు చేసిన అప్పులకు మిత్తి లు కట్టుకుంటూ ఇచ్చినా హామీలను ఆర్థిక ప్రాధాన్యత క్రమం లో అమలు చేస్తూ వెళ్తుంటే ప్రజలు మిమ్మల్ని ఎక్కడ మర్చిపోతారో అని ఇలా రైతుల సభ పేరుతో హడావుడి చేసి వెళ్తున్నారు..



మీరు వద్దు మహాప్రభో అనే మా కాంగ్రెస్ పార్టీ కి అధికారాన్ని కట్టబెట్టారు తెలంగాణ ప్రజనీకం, పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారు, స్థానిక సంస్థల్లో మరియు మున్సిపాలిటీ ఎలక్షన్స్ లో పాతలానికి తొక్కారు తెలంగాణ ప్రజనీకం అయినా ఇంకా మీ బుద్ధి మారలేదు..
సోషల్ మీడియా ఫేక్ ప్రచారాలు
చేసుకుంటూ ప్రజల్ని తప్పుదోవ
పట్టించే ప్రయత్నం చేస్తున్నారు..
శ్రీ రాజేందర్ రెడ్డి గూడ
ఆల్ ఇండియా
ప్రొఫెషనల్
కాంగ్రేస్ సభ్యులు

# పూజలో ఈ ఆసనం వాడితే గ్రహ దోషాలు దూరం! దర్భాసనం మహిమ వెనుక శాస్త్ర రహస్యాలు!!




సాధారణంగా మనం ఇంట్లో పూజ చేసేటప్పుడు, శుభకార్యాల్లో, ఆలయాల్లో వ్రతాలు, హోమాలు చేసేటప్పుడు కానీ ఆసనం మీద కూర్చోవడం సంప్రదాయం. ఆసనం అంటే కూర్చోడానికి వాడే పీట, చాప లేదా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే నేల మీద పరచుకునే వస్త్రాలు వంటివి. హిందూ సంప్రదాయం ప్రకారం దేవుని పూజ కూర్చుని మాత్రమే చేయాలి. నిలుచుని పూజ చేయడం వలన ఆ పూజ ఫలించదు. అందుకే మన సంప్రదాయాల్లో పూజలో ఆసనానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. పురాణాలలో వివరించిన ప్రకారం పూజలో వాడే ఒక ప్రత్యేకమైన ఆసనం వలన సమస్త గ్రహ దోషాలు తొలగిపోతాయంట! మరి ఆ ఆసనం ఏమిటో, ఆ ఆసనానికి అంతటి విశిష్టత ఎలా వచ్చిందో ఈ కథనంలో తెలుసుకుందాం.

**పూజా కార్యక్రమాల్లో నేలపై ఎందుకు కూర్చోకూడదు?**

పూజ చేసే సాధకుడి శక్తిని భూమ్యాకర్షణ శక్తి కిందకు గుంజుతుందని, అందువల్ల వైదిక కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు నేలపై కూర్చోరాదని శాస్త్రం చెబుతోంది. పూజ చేసేటప్పుడు ఆసనం మీద కూర్చుని మాత్రమే పూజ చేయాలని ధర్మ గ్రంథాల్లో వివరించి ఉంది. మరి ఆ ఆసనం గ్రహ దోషాలు కూడా తొలగించేదైతే మరింత శ్రేష్టం కదా! అలాంటి ఆసనం ఏదైనా ఉందా! అంటే తప్పకుండా ఉంది. ఎన్నో యుగాల క్రితమే మన మహర్షులు తపస్సు చేయడానికి ఉపయోగించిన ఆసనం ం ఉపయోగించవచ్చు. అదేమిటో చూద్దాం.

**దర్భాసనం**

దర్భ, లేదా కుశ గడ్డి హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన గడ్డి జాతి. యజ్ఞయాగాదులు, పూజలు, పితృకర్మలు, గ్రహణ సమయంలో శుద్ధి కోసం దీనిని ఉపయోగిస్తారు. ఇది శ్రీమహావిష్ణువు శరీర కేశాల నుండి ఉద్భవించిందని పురాణాల నమ్మకం. దర్భలకు అధిక ఉష్ణశక్తిని నిరోధించే సామర్థ్యం, క్రిమిసంహారక శక్తి కూడా ఉంది. పూజా సమయంలో దర్భలతో చేసిన ఆసనం మీద కూర్చుని పూజ చేయడం వలన గ్రహ సైతం తొలగిపోతాయంట! అదెలాగో చూద్దాం.

**దర్భల విశిష్టత**

వరాహ పురాణం ప్రకారం, శ్రీ మహా విష్ణువు వరాహ అవతారంలో ఉన్నప్పుడు ఆయన శరీరంలోని కేశాలు రాలి దర్భలుగా మారాయని, అందువల్ల దర్భాష్టమి నాడు వీటికి ప్రత్యేక పూజలు చేస్తారు.

గ్రహణ దోషాలు పోగొట్టే దర్భ

గ్రహణ సమయంలో వెలువడే హానికరమైన రేడియేషన్, క్రిములను నశింపజేయడానికి ఆహార పదార్థాలు, నిల్వ ఉంచే పచ్చళ్లపై, త్రాగే నీటిలో దర్భలను ఉంచడం మనకు తెలిసిందే!

**దర్భలో ఔషధ గుణాలు**

దర్భ గడ్డికి విషాన్ని విరుగుడు చేసే శక్తి ఉందని, జలాన్ని శుద్ధి చేస్తుందని నమ్ముతారు.

**కేతువు అనుగ్రహం ప్రసాదించే దర్భ**

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం నవగ్రహాల్లో కేతువు మోక్షకారకుడు. దానికి కారణం కేతు గ్రహానికి అధిదేవత బ్రహ్మదేవుడు కావడమే! కేతువు అనుగ్రహం పొందడం కోసమే శాస్త్రం సూచించిన సమిధ దర్భ. ప్రత్యేకించి పూజ కార్యక్రమాల కోసం శ్రేష్టమైన దర్భలతో ఆసనాన్ని తయారు చేస్తారు. ఈ దర్భాసనంపై కూర్చుని పూజలు, జపతపాలు, ధ్యానం చేసుకోవడం వలన గ్రహ దోషాలు తొలగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

**బ్రహ్మ జ్ఞానం సిద్ధింపజేసే కేతువు**

కేతువు అనుగ్రహంతో తపస్సు, మంత్ర కుశలత, బ్రహ్మ జ్ఞానం, బుద్ధి కుశలత సిద్ధిస్తాయి. అందుకే పూజలు, వ్రతాలు, హోమాలు చేసేటప్పుడు దర్భాసనంపై కూర్చుని చేయడం వలన ఎలాంటి గ్రహ దోషాలైనా తొలగిపోతాయి.

**దర్భాసనం సిద్ధంగా లేకపోతే**

ఒక్కోసారి అవసరానికి దర్భలతో అల్లిన ఆసనం సిద్ధంగా ఉండదు. అలాంటప్పుడు కనీసం ఒక్క దర్భ అయినా నేల మీద ఉంచి దానిపై పరిశుభ్రమైన వస్త్రాన్ని పరచుకుని వైదిక కార్యక్రమాలు నిర్వహించడం వలన దర్భాసనంపై కూర్చుని కార్యక్రమాలు జరిపిన ఫలితం సిద్ధిస్తుంది. వాల్మీకి రామాయణం ప్రకారం శ్రీరాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు, విశ్వామిత్రునితో కలిసి యాగ రక్షణ కోసం వెళ్లినప్పుడు దర్భాసనం పైనే శయనించాడని తెలుస్తోంది. ఇంతటి పవిత్రమైన దర్భాసనం మనం నిత్యం వాడే పూజలో ఆసనంగా ఉపయోగించుకోవచ్చు. అంతేకాదు ఈ దర్భాసనం మనకు పూజ ఫలితాన్ని సంపూర్ణంగా ఇవ్వడమే కాకుండా సమస్త గ్రహ దోషాలు సైతం తొలగిస్తుంది. కాబట్టి ఇకపై పూజలో దర్భాసనంకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది.

**శుభం భూయాత్!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# భక్తుడి పేరుతో వెలసిన నారాపుర వెంకన్న- రథోత్సవం మతసామరస్యానికి ప్రతీక!




కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి వెలసిన తిరుమల ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన దేవాలయంగా పేరొందింది. ఒక్క తిరుమలలోనే కాకుండా వేంకటేశ్వర స్వామికి తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల ఆలయాలున్నాయి. ఈ ఆలయాలు ఎక్కువ భాగం టీటీడీ ఆధ్వర్యంలోనే నడుస్తుండడం విశేషం. సాధారణంగా ప్రతి ఆలయానికి ఒక స్థల పురాణం ఉంటుంది. భక్తుని పేరుతోనే వెలసిన క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఒక మహిమాన్వితమైన వేంకటేశ్వరస్వామి ఆలయ విశేషాలు ఈ కథంలో తెలుసుకుందాం.

**నారాపుర వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎక్కడుంది?**

కడప జిల్లా జమ్మలమడుగులోని నారాపుర వేంకటేశ్వర స్వామి దేవాలయం వెలసి ఉంది. ఈ ఆలయం పెన్నా నది ఒడ్డున, జమ్మల ుడుగు పట్టణం నదికి అవతలి వైపున ఉంది.

**ఆలయ స్థల పురాణం**

విజయనగర రాజు విజయ దేవరాజు జమ్మలమడుగులో విష్ణు దేవాలయాన్ని నిర్మించాలని సంకల్పించి తన భార్య నారాయణమ్మతో కలిసి ఆ ప్రదేశాన్ని సందర్శించాడు. కోవెల నిర్మించాలని సంకల్పించిన ప్రదేశం రాణి నారాయణమ్మ పేరు కలిసి వచ్చేలా ఆ అగ్రహారానికి నారాయణపురమని పేరు పెట్టాడు. అదే కాలక్రమేణా నారాపురంగా మారిందని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**భక్తుని పేరుతో వెలసిన వెంకన్న**

ఒకసారి వేంకటేశ్వర స్వామి తన భక్తుడైన నారాపురయ్యకు కలలో కనిపించి తన విగ్రహాన్ని ప్రతిష్టించమని ఆదేశించాడంట! తన విగ్రహం ఎక్కడ దొరుకుతుందో కూడా స్వామినే సూచించాడంట! శ్రీనివాసుని ఆదేశం మేరకు నారాపురయ్య ఒక మడుగులో వెతకగా అక్కడ వేంకటేశ్వర స్వామి విగ్రహం లభించింది. అనంతరం ఆ విగ్రహాన్ని అక్కడికి ఉత్తరదిశలో ఇసుక తిన్నెల్లో ప్రతిష్ఠించారు. నారాపురయ్య ప్రతిష్ఠించిన స్వామి కాబట్టి ఆనాటి నుంచి అక్కడ వెలసిన స్వామి నారాపుర వేంకటేశ్వర స్వామిగా పూజలందుకుంటున్నాడని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**బ్రహ్మోత్సవ శోభ**

ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ చతుర్దశి నుంచి వైశాఖ బహుళ అష్టమి వరకు నారాపుర వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30 అంకురార్పణ, మే 1, ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు 9 వ తేదీ జరిగే చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగుస్తాయి. మే 10 స్వామివారికి పుష్పయాగం జరుగనుంది. ఈ బ్రహ్మోత్సవాలలో ఒక్కోరోజు ఒక్కో వాహన సేవ జరుగుతుంది. అన్నింటికంటే విశేషమైనది స్వామివారి రథోత్సవం. మే 7, గురువారం రోజు జరగునన్న ఈ రథోత్సవం విశిష్టత తెలుసుకుందాం.

**రథోత్సవం మొదలైంది ఇలా**


దాదాపు 70 ఏళ్లకు పైగా దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని 2008లో టీటీడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండను తానీషా ప్రభువు పరిపాలిస్తున్న సమయంలో జమ్మలమడుగు పరగణాను పాలిస్తున్న కంచనపల్లె రఘునాథ పంతులు అనే భక్తుడు స్వామి ఆలయాన్ని పునరుద్ధరించి, రథం నిర్మించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తోంది.

**కులమతాలకు అతీతంగా సామాజిక ఐక్యత చాటుతూ**

శ్రీ నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఆఖరి రోజు జరిగే రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా అన్ని మతాల ప్రజలు స్వామి వారి రథాన్ని లాగడం మతసామరస్యానికి, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుంది. వేలాదిమంది భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొని స్వామివారిపై తమకున్న భక్తిప్రపత్తులు చాటుతారు.

ఈ రథోత్సవంలో పాల్గొనడానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలి వస్తారు. భక్తుని పేరుతోనే వెలసిన నారాపురం వేంకటేశ్వరస్వామిని బ్రహ్మోత్సవాలలో దర్శిస్తే సకల శుభాలు చేకూరుతాయని విశ్వాసం. మనం కూడా నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు తరలి వెళ్దాం. శ్రీనివాసుని అనుగ్రహాన్ని పొం పేరుతోనే వెలసిన నారాపురం వేంకటేశ్వరస్వామిని బ్రహ్మోత్సవాలలో దర్శిస్తే సకల శుభాలు చేకూరుతాయని విశ్వాసం. మనం కూడా ఎదుదాం. ఓం నమో వేంకటేశాయ!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.


# కోర్టుకు చేరిన ఎలాన్ మస్క్ - సామ్ ఆల్ట్‌మన్ వివాదం- ఏం జరిగిందంటే?



ఎలాన్ మస్క్, సామ్ ఆల్ట్‌మన్‌ల మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కోర్టుకు చేరింది. ఏప్రిల్ 28, 2026న అమెరికాలోని ఓక్‌ల్యాండ్‌లో ఉన్న ఫెడరల్ కోర్టులో ఈ దావా విచారణ ప్రారంభమైంది. ఇందులో మస్క్ తన మాజీ సంస్థ అయిన ఓపెన్‌ఏఐపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

2015లో ఈ సంస్థకు పునాది వేసింది తానేనని మస్క్ పేర్కొన్నారు. వాస్తవానికి, ఆరంభ నిధులను సమకూర్చడమే కాకుండా, సంస్థకు పేరును సూచించి, పలువురు కీలక వ్యక్తులను బృందంలోకి తీసుకువచ్చింది కూడా తానేనని తెలిపారు. ఇంకా ఓపెన్?ఏఐ పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగానే కొనసాగాలని ఉద్దేశంతో తాను సుమారు ౨38 మిలియన్ల విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఆ తర్వాత కంపెనీ తన వైఖరిని మార్చుకుందని ఆరోపించారు. "ఓపెన్?ఏఐ పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశాం. ఏ ఒక్క వ్యక్తి లేదా కార్పొరేషన్ ప్రయోజనం కోసం కాకుండా, యావత్ మానవాళి ప్రయోజనం కోసం కృత్రిమ మేధస్సును అభివృద్ధి చేశాం. మొదట్లో ప్రతి ఒక్కరూ దీనిపై అంగీకరించారు. అయితే 2019లో లాభాపేక్షతో కూడిన ఒక విభాగం ఏర్పాటైంది. ఇది మైక్రోసాఫ్ట్ వంటి ప్రధాన కార్పొరేషన్ల నుంచి బిలియన్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది" అని మస్క్ అంటున్నారు. ముఖ్యంగా సామ్ ఆల్ట్‌మన్, గ్రెగ్ బ్రాక్‌మన్ కంపెనీ లక్ష్యానికి ద్రోహం చేశారని, వ్యక్తిగత లాభాల కోసం ఈ స్వచ్ఛంద సంస్థను దోచుకున్నారని మస్క్ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ౨150 బిలియన్లకు పైగా నష్టపరిహారాన్ని కోరారు. ఈ నిధులను చట్టబద్ధంగా ఓపెన్?ఏఐ స్వచ్ఛంద విభాగానికి కేటాయించాలని అన్నారు. అదనంగా, ఆల్ట్‌మన్, బ్రాక్‌మన్‌లను తమ పదవుల నుంచి తొలగించాలని, కంపెనీని తిరిగి లాభాపేక్ష లేని సంస్థగా పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. 'మస్క్ సీఈవో కావాలనుకున్నారు': మస్క్ సాక్ష్యం ఇస్తున్న సమయంలో కోర్టులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒక స్వచ్ఛంద సంస్థను దోచుకోవడాన్ని సహిస్తే, యునైటెడ్ స్టేట్స్‌లోని మొత్తం స్వచ్ఛంద సేవా వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని ఆయన వాదించారు. దీనికి ప్రతిస్పందనగా, ఓపెన్‌ఏఐ తరఫు న్యాయవాది, మస్క్ స్వయంగా నియంత్రణను చేజిక్కించుకుని సీఈవో కావాలని ప్రయత్నించారని, అది జరగకపోవడంతో ఆయన ఈ దావా వేశారని ఎదురు వాదించారు. ఏఐ భద్రత విషయంలో మస్క్‌కు నిజంగా చిత్తశుద్ధి లేదని, కేవలం తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడమే ఆయన అసలు లక్ష్యమని ఆరోపించారు. మరోవైపు సోషల్ మీడియాలో తమ వ్యాఖ్యల తీవ్రతను తగ్గించుకోవాలని న్యాయమూర్తి గొంజాలెజ్ రోజర్స్ ఇరు పక్షాలకు సూచించారు. ఓపెన్?ఏఐలో భారీ పెట్టుబడి పెట్టినందున, మైక్రోసాఫ్ట్? కూడా ఇందులో పరోక్షంగా ఇరుక్కుంది. ఈ కేసు కేవలం ఇద్దరు ప్రముఖ వ్యాపారవేత్తల మధ్య పోరాటం మాత్రమే కాదు; ఇది మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశ్రమ భవిష్యత్తుపై ప్రభావం చూపగలదు.

# సమ్మర్‌లో ఈ సలహాలు పాటించండి - ఆయిల్ స్కిన్ సమస్యకు చెక్ పెట్టండి!



వేసవిలో డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి ఆరోగ్య సమస్యలే కాకుండా పలు చర్మ సంబంధిత సమస్యలూ ఉత్పనమవుతాయి. ముఖ్యంగా జిడ్డు చర్మం, మొటిమలు, వేడి వల్ల చర్మం పొడిబారడం ఇలా ఈ సీజన్‌లో ఉండే సమస్యలు ఎన్నో! ఇక జిడ్డు చర్మతత్వం ఉన్న వారి బాధలు చెప్పనక్కర్లేదు. ఎంత శుభ్రం చేసుకున్నా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వారి స్కిన్? పదే పదే జిడ్డుగా మారుతుంటుంది. వీటన్నింటి నుంచి విముక్తి పొందడానికి చాలామంది చాలా రకాల ప్రయత్నాలే చేస్తుంటారు. నిజానికి మనం చేసే కొన్ని పొరపాట్లే జిడ్డు చర్మాన్ని మరింత జిడ్డుగా మారేలా చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. తద్వారా మచ్చలు, బ్లాక్?హెడ్స్?, మొటి మలు వంటి సమస్యలకు దారితీస్తాయని హెచ్చరిస్తున్నారు. అయితే ఆ పొరపాట్లేంటో తెలుసుకొని వాటిని సరిచేసుకుంటే ఆయిల్ స్కిన్? ఉన్న వారు కూడా ఈ సమ్మర్?లో ఇబ్బంది లేకుండా ఉండొచ్చని చెబుతున్నారు. మరి ఇంతకీ అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం. మానవ శరీరంలోని సెబేషియస్ గ్రంథులు విడుదల చేసే సీబమ్ చర్మాన్ని తేమగా ఉంచుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే అది మరింత ఎక్కువగా ఉత్పత్తవడం వల్ల స్కిన్? జిడ్డుగా మారుతుందని చెబుతున్నారు. నీళ్లు ఎక్కువగా తాగకపోయినా సీబమ్ ఉత్పత్తి పెరుగుతుందని తెలియజేస్తున్నారు. ఇది జిడ్డు చర్మాన్ని మరింత జిడ్డుగా మార్చుతుందని అందుకే ఇలా జరగకూడదంటే సరైన మోతాదులో వాటర్? తాగాలని సూచిస్తున్నారు. అత్యవసర నూనెల పాత్ర కీలకం :శరీర సౌందర్యాన్ని పెంపొందించడంలో అత్యవసర నూనెల పాత్ర కీలకమని చెబుతున్నారు. అయితే వీటిలో కొన్ని ఆయిల్స్? చర్మంపై జిడ్డును బ్యాలన్స్ చేసి అలర్జీ, మొటిమలు వంటి సౌందర్య సమస్యల నుంచి విముక్తి కలిగిస్తాయని తెలియజేస్తున్నారు. కానీ మరికొన్ని ఆయిల్స్? మాత్రం ఈ జిడ్డుదనాన్ని మరింతగా పెంచుతాయని హెచ్చరిస్తున్నారు. ఇందులో కొబ్బరి నూనె ఇదే కోవకు చెందుతుందని పేర్కొంటున్నారు! అందుకే ఈ సమస్య ఉన్న వారు కొబ్బరి నూనెను ఉపయోగించకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. అలాగే దీన్ని జుట్టుకు పట్టించినా జుట్టు కూడా మరింత జిడ్డుగా మారుతుందని అంటున్నారు. అందుకే స్కిన్?కి సరిపడే అత్యవసర నూనెలను మాత్రమే ఉపయోగించాలని సూచిస్తున్నారు. మాయిశ్చరైజర్ ఇలా! :జిడ్డు చర్మతత్వం ఉన్న వారు స్కిన్ మరింత జిడ్డుగా మారుతుందని మాయిశ్చరైజర్ రాయడం మానేస్తారని కానీ ఇది కూడా చర్మం మరింత జిడ్డుగా మారేందుకు దోహదపడుతుందని అంటున్నారు! అలాగే ఒక చర్మతత్వం ఉన్న వారు మరో చర్మతత్వానికి సంబంధించిన మాయిశ్చరైజర్ రాసినా ఈ సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు. అందుకే చర్మతత్వాన్ని బట్టి సరైన మాయిశ్చరైజర్‌ను ఎంచుకోవడమనేది చాలా ముఖ్యమని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వేర్వేరు చర్మతత్వాలకు అనుగుణంగా ప్రత్యేకమైన మాయిశ్చరైజర్లు ప్రస్తుతం మార్కెట్?లో అందుబాటులో ఉన్నాయని వీటిని నిపుణుల సలహా మేరకు ఉపయోగించాలని సూచిస్తున్నారు. ఆయిల్ స్కిన్? ఉన్న వారు అధిక మొత్తంలో మేకప్ వేసుకున్నా చర్మం మరింత జిడ్డుగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదెలాగంటే మేకప్ వేసుకునే క్రమంలో చర్మ రంధ్రాలు మూసుకుపోవడంతో పాటు ఎక్కువ మొత్తంలో నూనెలు విడుదలవుతాయని చెబుతున్నారు! తద్వారా స్కిన్? మరింత జిడ్డుగా మారుతుందని పేర్కొంటున్నారు. కాబట్టి మేకప్ మోతాదులో ఉండేలా చూసుకోవాలని అదీ కూడా అత్యవసరమైతేనే వేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

అదేవిధంగా పదే పదే ముఖం శుభ్రం చేసుకుంటే జిడ్డు తగ్గుతుందని భావిస్తారని కానీ ఈ అలవాటు చర్మంపై మరింత జిడ్డుదనాన్ని పెంచుతుందని నిపుణులు పేర్కొంటున్నారు! అందుకే వర్కవుట్స్? తర్వాత లేదా బయటికి వెళ్లొచ్చినప్పుడు వంటి సందర్భాల్లో తప్ప నీడపట్టునే ఉంటే వెంట వెంటనే ముఖం కడగాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు.

# 'టాప్' లేపిన సన్ రైజర్స్..



ఐపీఎల్ 2026 సీజన్లో మాజీ చాంపియన్ సన్ రైజర్స్ హైదరాబాద్ దుమ్ము రేపింది. బుధవారం టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 33 పరుగులతో ఘనవిజయం సాధించింది. దీంతో తొలిసారిగా టోర్నీలో టాప్ ప్లేస్ ను దక్కించుకుంది. అంతకుముందు స్థానిక హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 235 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ స్టన్నింగ్ ఫిఫ్టీ (43 బంతుల్లో 69, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచి, ఆరెంజ్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడు. అనంతరం ఛేజింగ్ లో పంజాబ్ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఓవర్లన్నీ ఆడిన పంజాబ్ .. 7 వికెట్లకు 202 పరుగులు చేసి, ఓడిపోయింది. వన్ డౌన్ బ్యాటర్ కూపర్ కాన్లీ సూపర్బ్ సెంచరీ (59 బంతుల్లో 107 నాటౌట్, 7 ఫోర్లు, 8 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో పాట్ కమిన్స్, శివాంగ్ కుమార్ కు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఏడు విజయాలతో టేబుల్ టాప్ ప్లేస్ ను సన్ రైజర్స్ దక్కించుకుంది. మరోవైపు పంజాబ్ కు ఇది వరుసగా మూడో ఓటమి కావడం విశేషం. గురువారం జరిగే మ్యాచ్ లో రాయల్ చాలేంజర్స్ బెంగళూరుతో లక్నో సూపర్ జెయింట్స్ తలపడనుంది. భారీ స్కోరుతో బరిలోకి దిగిన పంజాబ్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సూపర్ ఫామ్ లో ఉన్న ప్రియాంశ్ ఆర్య (1) తొలి ఓవర్లోనే ఔట్ కావడం షాకింగ్ గా మారింది. తర్వాతి ఓవర్ లోనే మరో విధ్వంసక ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్ (3) కూడా వెనుదిరగడంతో పంజాబ్ కోలుకోలేకపోయింది. ఈ సీజన్ లో వీరిద్దరూ మెరుపు ఆరంభాలను ఇస్తూ, రాణిస్తున్నారు. అయితే వరుస బంతుల్లో వీరిద్దరూ వెనుదిరగడంతో పంజాబ్ కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5)ను ఇషాన్ మలింగా బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత మార్కస్ స్టొయినిస్ (28) వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. అయితే శివాంగ్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించి, కీపర్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. దీంతో పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. మరోవైపు నాలుగు వికెట్లు పడినా, కాన్నోలీ ఏమాత్రం వెనుకంజ వేయలేదు. చకచకా పరుగులు సాధిస్తూ, వేగంగా ఆడాడు. దీంతో పవర్ ప్లేలో 57 పరుగులు వచ్చాయి. సూర్యాంశ్ షెడ్గే (25) తనకు మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ ఐదో వికెట్ కు 47 పరుగులు జోడించడంతో పంజాబ్ కాస్త కోలుకున్నట్లు అయింది. ఈ దశలో 34 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన కాన్నోలీ, అన్ స్టాపబుల్ గా అనిపించాడు. మరోవైపు షెడ్గే ఔటైన తర్వాత శశాంక్ సింగ్ (4), మార్కో యన్సెన్ (19) విఫలమైనా తను మాత్రం చివరికంటా నిలిచాడు. ఈక్రమంలో 57 బంతుల్లో సెంచరీని కంప్లీట్ చేసుకున్నాడు. అతని పోరాటంతో పంజాబ్ రన్ రేట్ పడిపోకుండా ఓటమి పాలైంది. ఇక చక్కగా బౌలింగ్ చేసిన సన్ కెప్టెన్ పాట్ కమిన్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# అమన్‌ప్రీత్ గిల్ మృతి..




భారత క్రికెట్ రంగంలో తీవ్ర విషాదం నెలకొంది. భారత అండర్ 19 జట్టు మాజీ ఆటగాడు, మీడియం పేసర్ అమన్‌ప్రీత్ సింగ్ గిల్ (36) బుధవారం చండీగఢ్‌లో కన్నుమూశారు. ఇంత చిన్న వయసులో ఆయన మరణించడం క్రీడలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అమన్ ప్రీత్ సింగ్ గిల్ తన కెరీర్ ఆరంభంలో భారత స్టార్ క్రికెటర్లతో డ్రెస్సింగ్ రూమ్‌ను షేర్ చేసుకున్నారు. 2007లో విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా అండర్-19లో సభ్యుడిగా ఉండేవాడు. రవీంద్ర జడేజా, మనీష్ పాండే వంటి వారితో కలిసి ఆయన ఆడారు. దేశవాళి క్రికెట్లో పంజాబ్ జట్టు తరుపున ఆడుతున్న సమయంలో దిగ్గజా ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తో కలిసి డ్రెస్సింగ్ రూమ్ ను అమన్ ప్రీత్ సింగ్ పంచుకున్నారు. అమన్ ప్రీత్ సింగ్ అంతర్జాతీయ స్థాయికి చేరుకోకపోయినా, దేశవాళీ క్రికెట్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అమన్ ప్రీత్ సింగ్ చేసేవాళ్ల క్రికెట్లో పంజాబ్ జట్టు తరపున 2006 నుంచి 2008 మధ్యలో ఆరు ఫస్ట్ క్లాస్ మ్యాచ్లు ఆడి 11 వికెట్లను పడగొట్టారు. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్లో అప్పటి కింగ్స్ 11 పంజాబ్.. ప్రస్తుత పంజాబ్ కింగ్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నారు. ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ లో సీనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. అమన్ ప్రీత్ సింగ్ గిల్ మరణం వార్త తెలియగానే విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా తమ సంతాపాన్ని ప్రకటించారు. "పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ అమన్ ప్రీత్ మరణాన్ని ధ్రువీకరిస్తూ తాజాగా ఒక లేక విడుదల చేసింది. పంజాబ్ క్రికెట్ ఆటగాడిగా, సెలక్టర్‌గా అమన్ ప్రీత్ సింగ్ చేసిన సేవలు మరువలేనివి. ఆయన అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం" అని పేర్కొంది.

# తండ్రైన సూర్యకుమార్ యాదవ్



భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దంపతులు శుభవార్త చెప్పారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌కు ముంబై ఇండియన్స్‌కు చెందిన ఈ స్టార్ బ్యాటర్ తుదిజట్టు నుంచి పక్కకి తప్పుకోవడం పట్ల పెద్ద చర్చ జరిగింది. ఈ క్రమంలో ఆయన భార్య దేవిషా శెట్టిలకు పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిసి ముంబై ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. తన కుటుంబ అవసరాల కోసం సూర్యకుమార్ రాబోయే మ్యాచ్ నుంచి వైదొలగినట్లు తెలియడంతో ఫ్యాన్స్‌కు క్లారిటీ వచ్చింది. సూర్యకుమార్ కెరీర్ పరంగా చెప్పాలంటే 2026 ఎంతో గొప్పగా సాగింది. ఆయన కెప్టెన్సీలో టీమ్‌ఇండియా జట్టు టీ20 ప్రపంచకప్ లో విజేతగా నిలవగా.. ఇప్పుడు ఆయన భార్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో సూర్యకుమార్ యాదవ్ ఆనందం రెట్టింపు అయ్యింది. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సూర్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ రేసులో అతికష్టం మీద సాగుతోంది. 10 మ్యాచ్‌ల తర్వాత కేవలం ఆరు పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో ముంబై ఇండియన్స్ నిలిచింది. ఈ టీమ్ ప్లేఆఫ్స్‌కు చేరాలంటే ఆడే ఇకపై లీగ్‌లో ఆడాల్సిన ప్రతి మ్యాచ్ తప్పక గెలవడంతో పాటు నెట్ రన్‌రేట్ కూడా మెరుగ్గా ఉండాల్సిన అవసరం ఉంది.అతని వ్యక్తిగత ఫామ్ ఏమాత్రం సంతృప్తికరంగా లేనప్పటికీ.. ఈ ఆటగాడికి 2026 ఏడాది అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఎందుకంటే, దాదాపు రెండు నెలల క్రితం మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి, అతను కెప్టెన్‌గా వ్యవహరించి భారత్‌కు 2026 టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను అందించాడు. ఐపీఎల్ 2026లో తిరిగి ఫామ్‌లోకి రావాలని సూర్యకుమార్ ఆశిస్తున్నాడు. ఇప్పటివరకు జరిగిన 10 మ్యాచ్‌లలో అతను 19.50 సగటుతో, 145.52 స్ట్రైక్ రేట్‌తో కేవలం 195 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆరోగ్య సమస్యల కారణంగా రెండు మ్యాచ్‌లకు ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరమవ్వగా.. ఇప్పుడు సూర్య కుమార్ యాదవ్ కూడా ఆర్సీబీతో మ్యాచ్‌లో తప్పుకోవడంతో జట్టుకు జస్‌ప్రీత్ బుమ్రా లేదా రోహిత్ శర్మ కెప్టెన్సీ వ్యవహరించే అవకాశం ఉంది.

# నేను తప్పు చేసిన మాట నిజమే: డేవిడ్ వార్నర్ కీలక వ్యాఖ్యలు



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తన తప్పును ఒప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. గత నెలలో సిడ్నీలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో వార్నర్ పట్టుబడ్డారు. ఆ సమయంలో సేవించిన మద్యం మోతాదు చట్టప్రకారం ఉండాల్సిన సాధారణ పరిమితి కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. ఈ కేసుకు సంబంధించి వేవర్లీ లోకల్ కోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, వార్నర్ హాజరు కాకపోవడంతో కోర్టు దీనిని జూన్ నెలకు వాయిదా వేసింది.వార్నర్ తరపు న్యాయవాది బాబీ హిల్ ఈ విషయంపై స్పందిస్తూ తన క్లయింట్ చేసిన పనిని అతి బుద్ధిహీనమైన చర్యగా భావిస్తున్నారని మీడియాకు తెలిపారు. స్నేహితుని ఇంట్లో మూడు గ్లాసుల వైన్ తాగిన వార్నర్, ఉబర్( లో వెళ్లడానికి బదులుగా స్వయంగా కారు నడపాలని నిర్ణయించుకోవడం తప్పుడు నిర్ణయమని ఆయన అంగీకరించారు. అయితే పోలీసు స్టేషన్‌లో చేసిన రెండో శ్వాస పరీక్ష సమయంపై కొన్ని సాంకేతిక సందేహాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# చరిత్ర సృష్టించిన కనోలి



సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓడిపోయినా ఆ జట్టు యువ సంచలనం కూపర్ కనోలి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్య ఛేదనలో మరో ఎండ్‌లో సహకారం లేకున్నా పోరాటపటిమతో ఆత్మవిశ్వాసం ప్రదర్శించాడు. ఈ క్రమంలోనే శతకం బాదేశాడు. దీంతో కనోలి ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు నెలకొల్పాడు. అతడి తాజా సెంచరీతో 10ఏళ్ల రికార్డు బ్రేక్ అయ్యింది. 22 ఏళ్ల కనోలి ఈ మ్యాచ్‌లో వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగాడు. మొత్తం 59 బంతుల్లో 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 8 సిక్సలు1 7 ఫోర్లు ఉండడం విశేషం. దీంతో కనోలి 19ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో సెంచరీ నమోదు చేసిన అతిపిన్న విదేశీ ఆటగాడిగా అరుదైన రికార్డు కొట్టాడు. ఈ సెంచరీ నమోదు చేసే నాటికి కనోలి వయసు 22 ఏళ్ల 257 రోజులు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డు సౌతాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డి కాక్ పేరిట ఉండేది. అతడు 2016లో దిల్లీ డేర్‌డెవిల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, ఆర్సీబీపై సెంచరీ బాదాడు. ఆ రోజుకి డికాక్ వయసు 23ఏళ్ల 122 రోజులు. గత 10ఏళ్లుగా ఈ రికార్డు అతడి పేరిటే కొనసాగుతూ వస్తోంది. తాజా మ్యాచ్‌తో కనోలి ఆ రికార్డు బద్దలుకొట్టాడు.అలాగే ఈ మ్యాచ్‌తో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డును కూడా కనోలి బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసిన రెండో బ్యాటర్‌గా కనోలి నిలిచాడు. ఈ క్రమంలో అతడు క్రిస్ గేల్ (104 పరుగులు జం సన్‌రైజర్స్, 2018లో) ను అధిగమించాడు. ఈ లిస్ట్‌లో పాల్ పాల్థాటీ టాప్‌లో ఉన్నాడు. అతడు 2011లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 120 రన్స్ చేశాడు. ఇక రెండో స్థానంలో కనోని ఉండగా, ఆ తర్వాత ఈ లిస్ట్‌లో వరుసగా డేవిడ్ మిల్లర్ (101), హషీమ్ ఆమ్లా (100), మయంక్ అగర్వాల్ (100) ఉన్నారు.కాగా, పంజాబ్ కింగ్స్ తరఫున 22ఏళ్లకే సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా కనోలి నిలిచాడు. అతడి కంటే ముందు ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఈ ఫీట్ సాధించాడు. ప్రభ్‌సిమ్రన్ 2023 ఎడిషన్‌లో దిల్లీ క్యాపిటల్స్‌పై సెంచరీ చేశాడు. అలాగే ఇదే ఏజ్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక సిక్సలు బాదిన ఆటగాడిగానూ రికార్డు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కనోలి 8 సిక్సలు బాదాడు. ఇదివరకు కూడా ఈ రికార్డు కనోలి పేరిటే ఉంది. ఇదే సీజన్‌లో లఖ్‌నవూతో మ్యాచ్‌లో 7 సిక్సలు కొట్టాడు.

# క్లారిటీ లేకుంటే టాప్ ప్లేయర్స్ ఉన్నా వేస్టే: రిషభ్ పంత్

క్లారిటీ లేకుండా క్రికెట్‌లో రాణించడం కష్టమని లక్నో సూపర్ జెయింట్స్(రూా+) కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. స్పష్టత లేనప్పుడు జట్టులో ఎంత పెద్ద ప్లేయర్లు ఉన్నా వృథానేనని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో లక్నో వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన రిషభ్ పంత్.. తమ జట్టును గాయాల బెడద వేధిస్తోందని తెలిపాడు. దాంతో తుది జట్టులో పలు మార్పులు చేశామని వెల్లడించాడు. 'మా జట్టులో కొందరు ఆటగాళ్లకు గాయాలయ్యాయి. అందుకే ఇంగ్లిస్ స్థానంలో అర్షిన్ కుల్కర్ణి జట్టులోకి వచ్చాడు. ఇంగ్లిస్‌కు స్వల్ప గాయమైంది. మోహ్సిన్‌కు కూడా చిన్న గాయమైంది. దాంతో మణిమారన్ సిద్ధార్థ్ స్థానంలో షాబాజ్ అహ్మద్ బరిలోకి దిగాడు. మేం మరింత క్లారిటీతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాం. మేమంతా అగ్రశ్రేణి ఆటగాళ్లమని మాకు తెలుసు. కానీ కొన్నిసార్లు క్రికెట్‌లో స్పష్టత లోపించినప్పుడు ఇలా పరాజయాలు ఎదురవుతుంటాయి. కాబట్టి చాలా వరకు మేం స్పష్టత గురించి మాట్లాడుకుంటున్నాం. బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా కొన్ని మార్పులు ఉన్నాయి. కాబట్టి వీటిని పరిష్కరించి వచ్చే సీజన్ నాటికి సిద్ధమవుతామని ఆశిస్తున్నాం. టీ20 క్రికెట్‌లో స్థిరమైన వాతావరణం ఉండటం చాలా అవసరం. కానీ అదే సమయంలో మార్పులు అవసరమైనప్పుడు ఆ మార్పులు చేయగలగాలి. ఎందుకంటే ప్రతిసారీ ఒకే పని చేయడం వల్ల ఒకే రకమైన ఫలితం రాకపోవచ్చు. కాబట్టి కొన్నిసార్లు కొత్తగా ప్రయత్నించాలి. ముఖ్యంగా



ప్రస్తుతం మేం ఉన్న స్థితిలో ప్రయోగాలు చేయడం తప్పేం కాదు. ఇది 180-190 స్కోరు వచ్చే వికెట్‌లా కనిపిస్తోంది. గతంలో జరిగిన చాలా మ్యాచ్‌ల కంటే ఇది మెరుగైన వికెట్.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిచిన రజత్ పాటిదార్ బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. 'చిన్నస్వామి స్టేడియం తరహాలో ప్రేక్షకుల గోల లేకపోయినా.. ఇప్పటికీ సందడిగానే ఉంది. ఇది గట్టి ఉపరితలం అని నేను భావిస్తున్నా. ఇది నల్ల రేగడి నేల పిచ్. పైగా ఇక్కడ గత 4-5 మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లు నమోదయ్యాయి. మేం ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోరుకు పరిమితం చేయడానికి ప్రయత్నిస్తాం.గత మ్యాచ్ తర్వాత మాకు సుదీర్ఘ విరామం లభించింది. అందరూ మంచి మానసిక స్థితిలో కనిపిస్తున్నారు. ఆరు ఏడు రోజుల కష్టపడి చేసిన శిక్షణ తర్వాత మేం మళ్లీ కలిశాం. నేను చెప్పినట్లుగా.. టోర్నీ ఆసాంతం అందరూ బాగా రాణిస్తున్నారు. మేం ఈ గేమ్ కోసం ఎదురుచూస్తున్నాం. మేం పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్నాం.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.



# ఆద్యంతం వినోదభరితం

ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మాణంలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'.తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఈనెల 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం లావణ్య త్రిపాఠి మీడియాతో ముచ్చటించారు.'సతీ లీలావతి' మూవీని ఆల్రెడీ చూశాను. చాలా బాగుంది. నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇక ఆడియెన్స్ ఎలాంటి రిజల్ట్ ఇస్తారో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. నేను ఇందులో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. సినిమా ఆద్యంతం ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు. నేను, నా మేనేజర్ సినిమా చూస్తూ బాగా నవ్వుకున్నాం. కొన్ని చోట్ల ఎమోషనల్‌గా ఉంటుంది. మంచి మెసెజ్ ఉన్నా కూడా ఏదో క్లాస్ పీకుతున్నట్టుగా అనిపించదు. ఈ సినిమాలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటి ప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకీ రాకూడదు. నాకు రియల్ లైఫ్‌లో వరుణ్ లాంటి మంచి భర్త దొరికారు. ప్రస్తుతం నేను నా భర్త, కొడుకుతో హ్యాపీగా ఉన్నాను. ఈ సినిమా చేస్తున్నప్పుడు నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. అలా అని స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కాకపోతే యాక్షన్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. రామ్ చరణ్ మాకు ఎప్పుడూ సపోర్టివ్‌గానే ఉంటారు. మా కోసం ఆయన ట్రైలర్ రిలీజ్ చేయడం సంతోషంగా అనిపించింది. రామ్ చరణ్ రిలీజ్ చేయడంతో మాకు మరింత రీచ్ వచ్చింది. చిరంజీవి మా అందరినీ ఎంతో ఎంకరేజ్ చేస్తుంటారు. మేం కూడా ఆయనకు ట్రైలర్ చూపించాలని అనుకుంటున్నాం.దేవ్మోహన్ అద్భుతమైన నటుడు. కమల్ హాసన్ 'సతీ లీలావతి'తో పోల్చలేం. కానీ మా సినిమా మాత్రం వినోదాత్మకంగా సాగుతుంది. ఈ చిత్రం ఎంతో రిఫ్రెషింగ్‌గా ఉంటూ పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. నేను, వరుణ్ కలిసి నటించాలని ఉంది. మేమిద్దరం కలిసి నటించాలంటే ఆ కథ కచ్చితంగా చాలా భిన్నంగా ఉండాలి.

# పెద్ది ఎడిటింగ్ వర్క్ పూర్తి

**• 4న విడుదలకు రంగం సిద్ధం**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ డైరెక్టర్ బుచ్చి బాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది గురించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్ర ఎడిటింగ్ వర్క్ పూర్తయినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమా అవుట్‌పుట్ చిత్ర బృందం ఎంతో సంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జూన్ 4న విడుదల కానున్నప్పటికీ, అంతకంటే ఒకరోజు ముందే అంటే జూన్ 3న భారీ స్థాయిలో ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివరాజ్ కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఓవర్సీస్‌లో మే 7 రాత్రి నుంచి 'పెద్ది' అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. విడుదల తేదీ దగ్గరపడుతుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. తాజాగా సినిమా ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా పాల్గొని, పెద్ది గురించి పలు విశేషాలు పంచుకున్నారు. 'పెద్ది'లో 70-80ల మధ్య విజయనగరం బ్యాక్‌డ్రాప్ ఉంటుందన్నారు. పొలం గట్టుపై కూర్చొని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ కలుగుతుందో.. ఈ సినిమా చూసినా అదే ఫీలింగ్ కలుగుతుందన్నారు. మరోవైపు త్వరలోనే దీని ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# అగధ టీజర్ విడుదల

కామాక్షి భాస్కర్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విశ్వంలో ఎన్నో అతీత శక్తులు దాగున్నాయంటూ ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది. 'అగధ' ముందు ఎవరి ఆటలు సాగవంటూ చెప్పే డైలాగ్ పాత్ర ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ప్రతిక్షణం ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించాలన్నదే తన ప్రయత్నమని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, గెటప్స్, ఆ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ , భయం గొలిపే లొకేషన్లు, విచిత్రమైన ఎక్స్ప్రెషన్స్ , మధ్య మధ్యలో ఆసక్తి రేకెత్తించే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. 'ఆ వీడియోలో నువ్వు ఏం చూసావమ్మా' అని అడిగితే, ఒక అమ్మాయి భయంతో వణికిపోతూ 'అగ్... అగ్... అగధ' అని చెప్పడంతో 'అగధ' అంటే ఎవరు అనే ఆసక్తి కలుగుతుంది. 'అగధ' వచ్చేసిందమ్మా. 'అగధ' ముందు ఎవ్వరి ఆటలు సాగవు. రా... 'అగధా రా'అంటూ వినిపించే డైలాగ్స్ తో టీజర్ తాలూకు




# శంబాల డైరెక్టర్‌తో సందీప్ కిషన్ మూవీ

టాలెంటెడ్ నటుడు సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. సందీప్ కెరీర్‌లో 33వ చిత్రంగా అత్యంత భారీ స్థాయిలో రూపొందనున్న కొత్త ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇదొక సోషియో-ఫాంటసీ, మైథాలజికల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కనుంది. 'మౌనంగా జన్మించాడు.. కాలాలను జయించేందుకు సిద్ధమయ్యాడు' అనే అర్థం వచ్చేలా విడుదల చేసిన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ పోస్టర్‌లో సింహం ఒక చిన్నారిని చూస్తూ గంభీరంగా కనిపిస్తుండగా, మధ్యలో ఉన్న కత్తి సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహిధర్ రెడ్డి ఈ పాన్-ఇండియా చిత్రాన్ని అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, ఈ ఏడాది ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది.






# ఓటీటీలోకి తిమ్మరాజుపల్లి టీవీ

హీరో కిరణ్ అబ్బవరం నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై అందరికీ బాల్యంలోని జ్ఞాపకాలను గుర్తుచేసింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకుల ముందుకువచ్చేందుకు సిద్ధమైంది. మే 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా తెలుపుతూ ఆహా పోస్టర్ విడుదల చేసింది. కొత్త నటీనటులను పరిచయం చేస్తూ వి.మునిరాజ్ ఈ సినిమాను తెరకెక్కించారు. టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం. తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అ÷-దదెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొ÷-టటె). ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదేరోజు రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది అన్నది మిగిలిన కథ.



# కార్తీతో మ్యాడ్ డైరెక్టర్ మూవీ

తమిళ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతుందనే విషయం తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైనట్లు తెలుస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమంతో అధికారికంగా పట్టాలెక్కింది. టాలీవుడ్‌లో 'మ్యాడ్' ,'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్, ఇప్పుడు హీరో కార్తీతో ఒక భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను ఎ÷-లాన్ చేశారు. ఈ సినిమాలో కార్తీ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించబోతుంది. నేడు హైదరాబాద్‌లో జరిగిన ముహూర్తపు వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు మరియు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నట్లు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ తోడవడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com